బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం, 26 జూలై-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

- కేంద్రం దిగిరాక తప్పని పరిస్థితి
- మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం
- కేంద్రం తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

మిగతా 4లో..



## విద్యార్థులే నిజమైన దేశభక్తులు

### ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్

### రాహుల్, ప్రియాంకల హర్షం



మిగతా 4లో..

# ధర్మేంద్ర రాజీనామాతో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత

- మరోమారు రెచ్చిపోయి పోలీసులపై రాళ్ల దాడి
- ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయాలు
- సంబరాల్లో మునిగిపోయిన విద్యార్థులు



న్యూఢిల్లీ,జులై 25 : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు పోలీసులపై రాళ్ల దాడికి దిగారు. నిరసనకారుల రాళ్లదాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వద్ద అదనపు బలగాలు మోహరించాయి. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు. అభిజిత్‌ను అభినందిస్తూ భుజాలపైకి ఎత్తుకున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా మిగతా 3లో..

## కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?
- నీట్ ఆందోళనతో దిగివచ్చిన ప్రధాన్
- దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదనే నిర్ణయం



న్యూఢిల్లీ, జూలై 25 : నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్రమోడీకి పంపారు. యువత, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనలకు కేంద్ర మంత్రి దిగొచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన రాజీనామా లేఖలో ఆయన మాట్లాడుతూ.. గత నాలు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలోకి పనిచేస్తున్నామని తెలిపారు. దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో తన నైతిక బాధ్యతగా భావించినట్లు లేఖలో పేర్కొన్నారు. 2026 మే 3న నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించిందని గుర్తు చేశారు. పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడంతో పాటు వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జూన్ 21నపరీక్ష విజయవంతంగా పూర్తయిందని అన్నారు. తాను మొదటి రోజు నుంచే బాధ్యత తీసుకున్నాని, మిగతా 3లో..

## సిజెపి ఆందోళను ఆసరగా దుష్ప్రచారాలు

- ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఇలాంటివే ప్రచారం
- 480కి పైగా సోషల్ మీడియా ఖాతాలు గుర్తించిన పోలీసులు



మిగతా 3లో..

## నేటితరం యువత ఆలోచనాపరులు



- వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి
- ఆదేశాలతో కాదు.. అర్థవంతమైన చర్చలతో సాగాలి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు

మిగతా 2లో..

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

- రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి
- త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు
- రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి




హైదరాబాద్,జులై 25 :రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , 40 శాతం వరకు ఎ÷–లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మారొచ్చు

- కేంద్రం పరిశీలిస్తోందన్న రాహుల్



న్యూఢిల్లీ, జూలై 25 : విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మరో శాఖకు మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్న వార్తలు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించబోదన్న వార్తల నడుమ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సహా మూడు డిమాండ్స్‌ను విద్యార్థులు ప్రభుత్వం ముందు పెట్టారని అన్నారు. వీటి విషయంలో వారు రాజీపడబోరని అభిప్రాయపడ్డారు. 'అసమర్థ, అవినీతి మరక అంటిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది మొదటి డిమాండ్. అయితే, ఆయన శాఖ మార్చే అంశం ప్రధాని కేబినెట్‌లో చర్చకు వచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. భారతీయ విద్యార్థులు దీన్ని అస్సలు ఆమోదించరు. దీన్ని ఎవ్వరూ ఒకప్పుకోరు' అని రాహుల్ గాంధీ చెప్పారు. ధ్వంసమైన విద్యార్థుల భవిష్యత్తు, అవినీతికి మిగతా 3లో..

## పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం: బండి



హైదరాబాద్,జులై 25 : 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. ' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

- ధర్మేంద్ర రాజీనామాపై కెటిఆర్ పోస్ట్



హైదరాబాద్,జులై 25 : యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజీపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్లు సీజీపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం సీజీపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.

## మంచినీటి సమస్య రాకూడదు

- మిషన్ భగీరథ ద్వారా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- 15 రోజులకోమారు స్వయంగా సమీక్ష చేపడతా
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క



హైదరాబాద్,జులై 25 : దేశవ్యాప్తంగా ఎల్ నీనో పరిస్థితులు నెలకొన్నాయని, ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై కూడా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాబోయే వేసవి పరిస్థితులు , నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాబోయే వంద రోజుల పాటు రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, నీటి సరఫరాపై ప్రతి 15 రోజులకు ఒకసారి తాను స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. విధుల పట్ల అశ్రద్ధ లేదా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ కూడా ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. గ్రామాల్లో ఎక్కడైనా అత్యవసరంగా తాగునీటి సమస్య తలెత్తితే 16వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక నీటి వనరులను మరింత మెరుగుపరచాలని, నిరుపయోగంగా ఉన్న బోర్వెల్స్‌కు వెంటనే మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలనిమిగతా 3లో..

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

- మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన
- సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ




మిగతా 2లో..

# ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

- గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే



న్యూఢిల్లీ,జూలై25 : నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

# నేటితరం యువత ఆలోచనాపరులు

- వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి
- ఆదేశాలతో కాదు.. అర్థవంతమైన చర్చలతో సాగాలి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూలై 25 : నేటితరం యువత ఆలోచనాపరులని, వారిని అర్థం చేసుకుని ముందుకు సాగాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నేటి యువతపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి తరం మార్గదర్శకత్వం లేనిదో లేదా దారి తప్పినదో కాదని స్పష్టం చేశారు. వారిని అర్థం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం కాకుండా అర్థవంతమైన చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల నిరసనలతో వాతావరణం అత్యంత వేడెక్కిన తరుణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 'విశ్వ మాంగల్య సభ' కార్యక్రమంలో మాట్లాడిన మోహన్ భగవత్ తరాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాన్ని ప్రస్తావించారు. 'మేము యువకులుగా ఉన్నప్పుడు విధేయత చూపించే వాళ్లం. కానీ ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. నేటి తరం ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంది. కాబట్టి మనం వారికి ప్రతి విషయాన్ని కారణాలతో సహా వివరించాల్సి ఉంటుంది. వారిపై ఎనలేని ప్రేమను చూపిస్తూ, వారితో సమయం గడపాలి. కుటుంబాల్లో సంభాషణలు తగ్గిపోతుండటం ఆందోళనకరం. యువత నమ్మకాన్ని గెలవాలంటే హుకుం జారీ చేయడం కాదు, వారితో మాట్లాడాలి. వారికి ఓ ఆత్మీయ భావన కలిగించాలి. ఆదేశాలు జారీ చేయడం కాకుండా చర్చలు జరిపి, ఒక ఏకాభిప్రాయానికి రావడం ముఖ్యం అని భగవత్ పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనల గురించి భగవత్ ప్రత్యక్షంగా ఎలాంటి ప్రస్తావన చేయకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇతర రాష్ట్రాలకు కూడా పాకిన ఈ సీజేపీ నిరసనలపై ఆయన ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ముఖ్యంగా జూలై 20న పార్లమెంట్ సమీపంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన తీవ్ర ఘర్షణలు ప్రజా ఆగ్రహాన్ని మరింత పెంచాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. మోహన్ భగవత్ గారు, జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న పరిణామాలపై గత నెల రోజులుగా మీరు పాటిస్తున్న మౌనం మీ ఉపన్యాసాల కంటే చాలా శక్తివంతంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ నిరసనల మధ్య ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తతరం ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తోందని, యువతకు సమాధానం ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. కొత్తతరంతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడిపి వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులను, యువత ఆలోచనా విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. నేటి కాలంలో ప్రతీది మొబైల్‌లోనే నిక్షిప్తమై ఉందన్నారు. నేటి కుటుంబాల్లోనూ పరస్పర సంభాషణలు తగ్గిపోతున్నాయిని మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలతో మరింత ఆప్యాయంగా మెలగాలని, వారి కోసం సమయం కేటాయించి మాట్లాడాలని ఆయన హితవుపలికారు. ప్రస్తుతం కొత్తతరం ప్రతి అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని, వారికి కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా తగిన కారణాలను వివరించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని అభిప్రాయపడ్డారు.

# హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు




- మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన
- సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ

న్యూఢిల్లీ,జూలై25 : హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూడదని కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతేగానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో మారుతున్న పరిణామాలు

- ఢిల్లీ నుంచి మహా సీఎం ఫడ్నవీస్‌కు పిలుపు
- మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాలు



న్యూఢిల్లీ,జులై 25 : మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీ రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ నుంచి పిలుపు రావటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాత న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీకి రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ పిలుపుతో రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్రం భారీ మార్పులకు సిద్ధం అవుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ దిశగా శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహా రాష్ట్ర లో సీఎం మార్పు జరుగబోతోందని అన్నారు. ఫడణవీస్‌కు కేంద్ర విద్యాశాఖను ఇవ్వబోతున్నారని చెప్పారు. కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కొంత కాలంగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కేంద్రం భావించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ప్రధాని విదేశీ పర్యటనల కారణంగా ఈ ప్రక్రియ కొంతకాలం పాటు వాయిదా పడినట్టు సమాచారం. ఇక పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రధాన్ సహా ఇతర మంత్రులు తప్పుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈలోపు విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. విపక్షలా నిరసనల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పార్లమెంటు కూడా ఎలాంటి కార్య కలాపాలు జరగకుండానే వాయిదా పడుతోంది. తాజాగా విద్యాశాఖ మంత్రి తప్పుకోవడంతో ఆ శాఖ ఎవరికి కేటాయిస్తారన్న ఉత్కంఠ మొదలైంది. ఇతర ప్రభుత్వ శాఖల విషయంలో ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది. నిన్న రాత్రి కేంద్రం 12 శాఖల సెక్రటరీలకు స్థాన చలనం కలిగించింది. వారిలో విద్యాశాఖ సెక్రటరీ కూడా ఉన్నారు. దీంతో, మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కేంద్రం పూర్తిస్థాయి దృష్టి పెట్టనుందా? అన్న చర్చ జరుగుతోంది.

# మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి

## కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ,జులై 25 : ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయమని, ప్రధాని మోదీ మొండి వైఖరికి దక్కినఓటమి అని వ్యాఖ్యానించారు. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలు అన్నింటిదీ ఈ విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌రాజీనామాపై నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావి స్తూ.. ఇది తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు క్షణాల్లో వైరల్ కాగా దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ 'నమస్కారం', 'లవ్' ఎమోజీలను జతచేసి తన మద్దతు చాటారు.

# ఎఐతో ఉన్న భయాలు తొలగించాలి




- ఎఐ ఉన్న అపోహలు తొలగిస్తేనే భవిష్యత్
- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు

న్యూయార్క్,జూలై25 : ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత కు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

# ఎన్‌డిఎలో ఇద్దరు రాజీనామా

## గతంలోనే వైదొలగిన ఎంజె అక్బర్



న్యూఢిల్లీ,జులై 25 : నీట్ పేపర్ లీకేజీపై కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థిలోకం నిరసనల ధాటికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ కేంద్రంగా దాదాపు నెల రోజుల పాటు అలుపెరగని పోరాటానికి.. యువతరం మొండిపట్టుదలకు ఎట్టకేలకు దిగొచ్చిన ప్రధాన్ శనివారం రిజైన్ చేశారు. గత ఎనిమిదేళ్లలో ఇలా పదవీకాలం మధ్యలోనే వైదొలిగిన ఏకైక కేంద్ర మంత్రి ప్రధానే కావడం విశేషం. 2018లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ అనూహ్యంగా రాజీనామా సమర్పించారు.కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థిలోకం శాంతించింది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాన్ స్వచ్ఛందంగా వైదొలగడంతో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు ఉద్యమాన్ని విరమించారు. అయితే.. గత ఎనిమిదేళ్లలో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక వ్యక్తి ధర్మేంద్ర ప్రధాన్. అయన కంటే ముందు.. 2018లో అనూహ్య పరిణామాల మధ్య ఎంజే అక్బర్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి బాధ్యతల నుంచి వైదొలిగారు. నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో మంత్రిగా 2016లో బాధ్యతలు చేపట్టిన అక్బర్.. అంతకుముందు వార్త పత్రిక ఎడిటర్‌గా ఉన్న సమయంలో పలు మహిళలపై లైంగిక వేధింపులు పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి.

# ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ కొరడా

## 31 కేసులు నమోదు చేసి రూ.1,19,600 జరిమానా విధింపు

ఏలూరు,జులై25 : జిల్లాలో ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. కలపర్రు టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 31 కేసులు నమోదు చేసి రూ.1,19,600 జరిమానా విధించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 593 కేసుల్లో రూ.40.27 లక్షల జరిమానాలు వసూలు చేశారు. వీకెండ్ లో రద్దీగా తిరిగే కాంట్రాక్ట్ క్యారేజీ వాహనాలపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది. అనుమతులు లేకుండా.. నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు బస్సు సంస్థలపై ఫోకస్ పెట్టింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కలపర్రు టోల్గేట్ వద్ద వాహన తనిఖీ అధికారులు కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు జరిపారు. 31 కేసులు నమోదు చేసి రూ. 1,19,600ల అపరాధ రుసుము విధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ శనివారం రాత్రి మీడియాకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా కమిషనరు ఆదేశాల మేరకు ప్రతి వారం కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న విషయము తెలిసిందే, దీనిలో భాగముగా ఈ యేడాది జనవరి ఒకటవ తేదీ నుంచి జులై 25 వరకు 593 కేసులు నమోదు చేసి రూ. 40,27,585/- అపరాధ రుసుము విధించినట్లు డిటిసి కరీమ్ తెలిపారు.

# ఎర్రచందనం ముఠాలకు సహకరిస్తే కఠిన చర్యలు

## అధికారులకు డిప్యూటి సిఎం పవన్ హెచ్చరికలు

అమరావతి,జులై25 : ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సీడ్‌బాల్స్ పంపిణీపై అటవీశాఖ అధికారులతో శనివారం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్ విసురుతామన్నారు. అటవీ విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎర్ర చందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్‌కు తెలియజేశారు.

# ధర్మేంద్రను అభినందించిన అమిత్ షా

## ప్రధాని మోడీతో తాజా పరిస్థితులపై చర్చ

న్యూఢిల్లీ,జూలై25 : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా.. ధర్మేంద్ర ప్రధాన్ నివాసానికి వెళ్లారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అమిత్ షా ప్రశంసించారు. దేశ విద్యా వ్యవస్థలో ధర్మేంద్ర ప్రధాన్ ఎన్నో సంస్కరణలు తెచ్చారని కొనియాడారు. విద్యాశాఖలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా అత్యవసరంగా భేటీ అయ్యారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తదనంతర పరిణామాలు, దేశ రాజధానిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, క్యాబినెట్‌లో మార్పులపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని మోదీ నివాసంలో ఈ భేటీ జరిగింది.

# ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

## గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ,జూలై25 : నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణా మం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకు న్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకో వాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

(మొదటిపేజీ తరువాయి)

# కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోకుండా కృషి చేశానని పేర్కొన్నారు. జూలై 16న ప్రకటించిన ఫలితాల్లో పేద, వెనకబడిన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు విజయాన్ని సాధించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో బాధ్యతయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థుల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను బాధించిందని చెప్పారు. గత 10 రోజులుగా జరిగిన పరిణామాలు కలిచివేశాయని, ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, దేశవ్యతిరేక శక్తులు దీనిని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, జాతీయ ఐక్యత కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండేందుకు, వారు చదువులపై దృష్టి సారించేలా చేయడానే ఉద్దేశంతోనే ప్రధాన మంత్రికి రాజీనామా లేఖ సమర్పించినట్లు వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు, విద్యాశాఖ అధికారులకు థాంక్స్ చెప్పారు. దేశ సేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజలు, దేశ యువత కోసం సేవ చేస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

# ధర్మేంద్ర రాజీనామాతో జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత

ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు. కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి. విద్యావ్యవస్థపై లోపాలను ఎత్తిచూపుతూ పుట్టుకొచ్చిన పార్టీనే సీజేపీ సరిగ్గా రెండు నెలల క్రితం అభిజీత్ దీప్కే దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని గంటల్లోనే ఇంటర్నెట్‌లో దాని పేరు మార్మోగిపోయింది. తర్వాత నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దీప్కే జంతర్ మంతర్ వద్ద ప్రారంభించిన నిరసనలకు భారీ సంఖ్యలో యువత స్పందించింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిరసన వేదికవద్దకు వచ్చి మద్దతు తెలిపారు. జులై 20న 'చలో పార్లమెంట్' మార్చ్, ప్రధాన్ రాజీనామా నుంచి సీజేపీ వెనక్కి తగ్గకపోవడంతో ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చింది. ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన 30 ఏళ్ల దీప్కే. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం చదివారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేశారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷-లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మారొచ్చు

ఆయన సంకేతంగా నిలిచారని వ్యాఖ్యానించారు. ఆయనను తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం నాటి విద్యార్థుల ర్యాలీలో పోలీసులు పె÷-లలెట్ గన్స్, లాఠీ చార్జ్‌కు దిగడాన్ని కూడా రాహుల్ గాంధీ ఖండించారు. ఈ చర్యలకు దిగిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత దేశ విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఒక గతమని, భవిష్యత్తు కోసం ఆయన పోరాడజాలరని వ్యాఖ్యానించారు.

## మంచినీటి సమస్య రాకూడదు

అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలున్న గ్రామాలను గుర్తించి, వారం రోజుల్లోగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. మండలాల వారీగా అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని, ఎక్కడా సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఏదైనా పైప్‌లైన్ లీకేజీలు లేదా రిపేర్ల కారణంగా ఒక రోజు నీటి సరఫరా నిలిచిపోతే, ఆ విషయాన్ని గ్రామస్తులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. దీనివల్ల ప్రజలు ముందస్తుగా నీటిని నిల్వ చేసుకుని సిద్ధంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఎల్ నీనో తీవ్రత దృష్ట్యా మిషన్ భగీరథ ఇంజనీర్లు , అసిస్టెంట్ ఇంజనీర్లు మరింత జవాబుదారీతనంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మిషన్ భగీరథతో ఇంకా అనుసంధానం కాని ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో ఏఈలు స్వయంగా పర్యటించి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని సీతక్క ఆదేశించారు. ప్రతి మండలంలో ఏఈలు స్థానిక సర్పంచ్‌లతో సమావేశమై మంచినీటి సరఫరా తీరుపై సమీక్షించాలని చెప్పారు. గతంలో కూడా ఎల్ నీనో పరిస్థితులు ఉన్నప్పటికీ సమర్థవంతంగా పనిచేసి నీటి ఎద్దడి లేకుండా చూశామని, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పనిచేయాలని కోరారు. 'జలసిరి' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వర్షపు నీటిలోని ప్రతి బొట్టునూ ఒడిసిపడితే భవిష్యత్తులో ఇలాంటి తాగునీటి సమస్యలను శాశ్వతంగా అధిగమించవచ్చని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## యువ విజయంపై అభిజిత్ తల్లి అనితా దీప్కే భావోద్వేగం

పుణె,జులై 25 :యువత విజయంపై కాక్రోచ్ పార్టీ చీఫ్ అభిజిత్ దీప్కే తల్లి అనితా దీప్కే స్పందించారు. భావోద్వేగానికి గురయ్యారు. నా కొడుకు ఉద్యమం మొదలు పెట్టినప్పుడు చాలా భయపడ్డాను. అతనికేమైనా జరుతుందేమోని ఆందోళన చెందాను. అభిజిత్ ను పోలీసులు కొట్టినపుడు మరింత భయమేసింది.. దాదాపు నెల రోజుల ఉద్యమంలో మేం నిద్రపోని రాత్రులు ఎన్నో.. తిండి కూడా సహించేదు కాదు..ఏ క్షణంలో ఏం జరగుతుందోని భయంగుప్పిట్లో బతికామని అనితాదీప్కే మీడియాతో తన అనుభవాన్ని పంచుకున్నారు.

## ఎపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదు

అమరావతి,జులై 25 : ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) పక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు. అత్యధికంగా 44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,22,174 మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216 గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు.

# జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

- కేంద్రమంత్రులతో సిజెపి ప్రతిధుల చర్చలు ఫలప్రదం
- విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం
- భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ
- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్



న్యూఢిల్లీ, జూలై 25 : జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిమారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతో పాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం దిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం.

## డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

- మండిపడ్డ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఆర్టీసిని ప్రైవేట్ పరం చేయబోమని హామీ




విశాఖపట్నం,జులై 25 : ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి మండిపడ్డారు. వైసీపీకి ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని విమర్శించారు. తాడేపల్లిలో జగన్ ఇంటి సమీపంలోనే ఉండి లోకేశ్ డీఎస్సీపై సవాల్ విసిరారని, దానిపై స్పందించేందుకు జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా వివరాలు ఇచ్చినప్పటికీ వైసీపీ రాజకీయ దివాళాకోరుతనంతో విమర్శలు చేస్తోందని మంత్రి మండిపల్లి అన్నారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలు చేపట్టలేని వారు రాజకీయ రంగు పులిమి విమర్శలు చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై చర్చించకుండా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉన్నంత వరకు ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటుపరం చేయబోమని.. అపోహలకు తావు లేదని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖలో సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను మంత్రి ప్రారంభించారు. రవాణా రంగంలో పీఎం ఈ-బస్ సేవతో నూతనశకం మొదలైందన్నారు. మరో రెండు నెలల్లో తొలి దశలో 750 ఈ- బస్సులు రానున్నాయని, అందు లో విశాఖకు 100 బస్సులు కేటాయించనున్నట్టు చెప్పారు. ప్రస్తుత బస్సులతో పాటు, కొత్త ఈ- బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

### బిఆర్ఎస్ ఎపి వద్దిరాజు రవిచంద్ర



న్యూఢిల్లీ,జులై 25 : ప్రశ్నాపత్రం లీక్ కావడానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదుల విజయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ , ఎంపీ వద్దిరాజు రవి చంద్ర అన్నారు. కాక్రోచ్ సైన్యాన్ని చూసి దేశం గర్వప డుతున్నదని, విద్యార్థులు,యువత ఆగ్రహించి పోరుబాట పడితే,అది ఏ స్థాయిలో ఉంటుందో యావత్ ప్రపంచం మరోసారి చూసిందని పేర్కొన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, బెదిరించినా, భయపెట్టినా, నిర్బంధాలు ప్రయోగించినా, లాఠీలెత్తినా, దేశద్రోహులు,సంఘ విద్రోహులు అని ముద్రవేసినా కూడా యువత వెనుకంజ వేయకుండా ఉద్యమించిందని అన్నారు. విద్యార్థుల పోరాటంలో న్యాయం ఉందని, ధర్మమైనదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. విద్యార్థుల ధర్మమైన ఆగ్రహావేశాలకు పార్లమెంట్ గేట్లు కూడా మూసేయాల్సిన పరిస్థితి తలెత్తిందంటే వారి బలమెంతో పాలకులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేస్తూ,దేశంలో ఇక ముందు ఎలాంటి పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ కాకుండా, అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా పాలకులకు హితవు పలికారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి విజయం

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




నిజామాబాద్,జూలై25 : కేంద్ర విద్యాశాఖ మం త్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత మొక్కవోని పోరాట పటిమతో సాధించిన ప్రజాస్వామ్య విజయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత రాజకీయాలకు అతీతంగా తమ భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం చేప ట్టిన ఉద్యమం చివరకు ఫలితాన్ని ఇచ్చింద న్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అవకత వకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చి తికి వ్యతిరేకంగా యువత శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం చివరకు స్పందించి దిగిరాక తప్పలేద న్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం లాఠీచార్జీలు, భాష్పవాయు గోళాలు, నిర్బంధా లను ఆశ్రయించినప్పటికీ, దేశ యువత ఏమా త్రం వెనక్కి తగ్గకుండా అపారమైన ధైర్యంతో తమ ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. 'అధి కారం ఎంత బలంగా కనిపించినా, చైతన్య వం తమైన యువత సంకల్పం ముందు తలవంచక తప్పదనే విషయాన్ని ఈ ఉద్యమం మరోసారి నిరూపించింది' అని అన్నారు. యువత ఐక్యపో రాటం ముందు ప్రభుత్వం దిగివచ్చే పరిస్థితి ఏర్పడిందని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆ ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన నైతిక విజయమని పేర్కొన్నారు. కానొక సందర్భం లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్టు ?'దేశం కోసం అవసరం వచ్చినప్పుడు ఇండియా రియాక్ట్ అవుతుంది'? అనే మాటలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. నేడు దేశ యువత అదే విషయాన్ని మరోసారి సాక్షాత్కరించిందన్నారు. 'యువత ప్రశ్నించడం ప్రారంభిస్తే అధికార వ్యవస్థలు జవాబుదారీతనం వహించక తప్పదు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకే అంతిమ తీర్పు' అని అన్నారు. చదువుకున్న యువత కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాదు... దేశ భవిష్యత్తు కోసం కూడా పోరాడుతుందని ఈ ఉద్యమం స్పష్టం చేసింది.

## సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా

### సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం

### వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుందాం

### ఆస్పరిలో సంజీవిని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు

కర్నూలు,జులై 25 : తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించిన సీఎం.. వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొ÷ల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

## ధర్మేంద్ర రాజీనామాపై వాంగ్‌చుక్ హర్షం

న్యూఢిల్లీ,జులై 25 : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయని పేర్కొన్నారు. జెన్-జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్ జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని రాసుకొచ్చారు.

## హౌజింగ్ కార్పోరేషన్ కీలక నిర్ణయం

### మూడు రోజుల గ్రాస్ సాలరీ వసూలు నిలిపివేత

అమరావతి,జులై 25 : ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కీలక నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల కోసం మూడు రోజుల గ్రాస్ శాలరీని వసూలు చేయాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను సంస్థ యాజమాన్యం పూర్తిగా రద్దు చేసింది.ఈ మేరకు జులై 16న జారీ చేసిన మెమోను రద్దు చేస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. అరుణ్ బాబు తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల ముందస్తు అనుమతి లేకుండానే జీతం కోత ప్రతిపాదించడం సరైంది కాదని గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెమోలో పేర్కొన్నారు. అలాగే, మూడు రోజుల జీతాన్ని ఉద్యోగుల సంక్షేమ నిధికి జమ చేయాలన్న ఆదేశాలు పూర్తిగా రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. జీతం కోతకు సంబంధించిన అన్ని ఉత్తర్వులు తక్షణమే అమలు కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారులకు ఎండీ ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఎండీ పి. అరుణ్ బాబు ఆదేశాలు జారీ చేశారు.

## కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టం

### మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వ్యాఖ్య

నాగర్ కర్నూల్,జులై 25 : నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి విషయంలో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటిందని పేర్కొన్నారు. వాంగ్ చుక్ దీక్ష విషయంలో, కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమాత్రం సమంజసంగా లేదని వెల్లడించారు.విద్యార్థుల మీద అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించిందని వివరించారు.

# సంపాదకీయం

## బొద్దింకలను తేలికగా తీసుకోరాదు !

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకు న్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగు తున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది. పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఓక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. ప్రజాస్వామ్యం,జవాబుదారీతనం కోసమే యువత వీధులకు ఎక్కింది. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవర మైన పనులనే చేయాలి. అప్పడే దేశం బాగుపడుతుంది. మాటలతో

## జంతర్ మంతర్ ఆందోళనకు దూరంగా ఉండాలి

- విద్యార్థులకు ఢిల్లీ యూనివర్సిటీ అడ్వయిజరీ జారీ
- యూనివర్సిటీల తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ,జూలై25 : జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న సీజేపీ నిరసనలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఢిల్లీ విశ్వవిద్యాలయం జారీ చేసిన అడ్వైజరీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించడం అంగీకారయోగ్యం కాదని మండిపడ్డారు. విద్యార్థుల హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్న వారే భవిష్యత్తులో జవాబుదారీగా నిలవాల్సి వస్తుందని రాహుల్ హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించే హక్కు మీకెవరిచ్చారంటూ ప్రశ్నించారు. సమయం వచ్చినప్పుడు దీనికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఢిల్లీ వర్సిటీని ఎంపీ రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనల దృష్ట్యా ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులకు భద్రతా సూచనలు జారీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జంతర్‌మంతర్‌లో నిరసనలు కఠిన నియంత్రణలో ఉంటాయని పేర్కొంది. చట్టవిరుద్ధంగా నిర్వహించే సభలు, ఆందోళనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని హెచ్చరించింది. అలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల వ్యక్తిగత భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు విద్యాభ్యాసం, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల విద్యార్థులు జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనలకు దూరంగా ఉండి, తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. సోషల్ మీడియాలో తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారం విస్తృతంగా ప్రచారం అవుతోందని డీయూ పేర్కొంది. ఎలాంటి సమాచారాన్నైనా విశ్వసించి, ఇతరులతో పంచుకునే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని విద్యార్థులకు సూచించింది. ఈ క్రమంలో నీట్ లీక్‌పై సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతోన్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు యూనివర్సిటీలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతోన్న తప్పులను ప్రశ్నించడానికి.. విద్యార్థులు తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నారన్నారు. వారిని ఆందోళనల్లో పాల్గొన వద్దని హెచ్చరించడానికి మీకెంత ధైర్యం అంటూ మండిపడ్డారు. సమయం వచ్చినప్పుడు ఇలాంటి చర్యలకు ఆయా విశ్వవిద్యాలయాలు జవాబుదారీగా ఉండాల్సి ఉంటుందన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగే ఆందోళనలపై చట్టపరమైన చర్యలు తీసు కునే అవకాశం ఉందని.. అందువల్ల ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లొద్దని ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కీ, ఐఐటీ మద్రాస్ సహా పలు విద్యాసంస్థలు తమ విద్యార్థులకు సూచించాయి. సోషల్ మీడియాలో కూడా నిరసనలకు సంబంధించి ఎలాంటి పోస్టులు చేయొద్దని కోరాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఈ హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపాయి. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ స్పందించారు. విశ్వవిద్యాలయాలు ఇచ్చిన సర్క్యులర్‌పై పలువురు ప్రముఖులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా.. పార్లమెంట్ సభ్యుడిగా డీయూ విడుదల చేసిన ఈ ప్రకటనను ఖండిస్తున్నాను. జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలు చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారు. ఇలాంటి విషయాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని ఎంపీ దీపేందర్ హుడా తెలిపారు. విద్యార్థుల గొంతులను అణచివేస్తే వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. మనకు నిజంగా వారి భవిష్యత్తుపై ఆందోళన ఉంటే.. మౌనంగా ఉండకుండా విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులకు మద్దతు ఇవ్వాలని నటి, చిత్రనిర్మాత పూజాభట్ అన్నారు.

## సిజెపి ఆందోళను ఆసరగా దుష్ప్రచారాలు



- ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఇలాంటివే ప్రచారం
- 480కి పైగా సోషల్ మీడియా ఖాతాలు గుర్తించిన పోలీసులు

న్యూఢిల్లీ,జూలై24 : ప్రస్తుత సీజేపీ ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన 480కి పైగా సోషల్ మీడియా ఖాతాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు. ఈ ఖాతాల ద్వారా వదంతులు, నకిలీ పోస్టులు, ఎడిట్ చేసిన వీడియోలను వ్యాప్తి చేసి విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఈ ఖాతాలను గుర్తించి బ్లాక్ చేసే పక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. తాజాగా గుర్తించిన ఈ ఖాతాల ద్వారా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో కూడా తప్పుడు సమాచారం ప్రచారమైందని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా, అధికారిక వర్గాల ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయిన కనీసం 18 తప్పుడు ప్రచారాలను ఇప్పటికే ఖండించామని తెలిపారు. నిరసనకారులపై పోలీసులు దాడి చేశారని, ఓ బాలిక మరణించిందని, కొందరు నాయకులను అదుపులోకి తీసుకున్నారని, గోళీలు లేదా మేకులు అమర్చిన లాఠీలు వాడారని వచ్చిన ప్రచారాలు వాస్తవం కాదని పోలీసులు స్పష్టం చేశారు (ఈజీ। ని।లిబ). సోషల్ మీడియాలో వచ్చే సందేశాలు, వీడియోలు లేదా పోస్టులను నిజానిజాలు తెలుసుకోకుండా ఫార్వర్డ్ చేయొద్దని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం సృష్టించడం లేదా ప్రచారం చేయడం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని హెచ్చరించారు.

## విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

- కేంద్రం తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్,జులై 25 : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన పదవి కాపాడుకోవడానికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. నీట్ పరీక్ష లీక్ జరిగినప్పుడే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చేదే కాదన్నారు. మూడు నెలల పాటు ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించిన ఆయన.. విద్యార్థులపై పెరిగిన ఒత్తిడి, నిరసనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. యువత తమ దమ్ము ఏంటో నిరూపించారని, వారి పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో పేపర్ లీకులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు. విద్యార్థుల డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రస్తుత ప్రభుత్వాలతో పాటు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలకు కూడా ఒక కనువిప్పుగా మారాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## విద్యార్థుల నిరసనలపై ప్రభుత్వ తీరు గర్హనీయం

- మోడీ ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్ ఎంపి సోనియా
- వైఫల్యాలను ఏకరవు పెడుతూ ప్రకటన విడుదల



న్యూఢిల్లీ, జూలై 25 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సోనియాగాంధీ ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా వ్యవస్థలో తీవ్రమైన వైఫల్యాలు వెలుగులోకి వచ్చినప్పటికీ సదరు కేంద్ర మంత్రి బాధ్యత వహించకుండా పదవిలో ఇంకా కొనసాగుతున్నారని సోనియా గాంధీ ధ్వజమెత్తారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ప్రస్తావించారు. జాతీయ పరీక్షల నిర్వహణ వ్యవస్థలో లోపాలపై మోదీ ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ల చేతుల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహణను ఉంచడం వల్లే ఈ పరీక్షల విశ్వసనీయత దెబ్బతిందని ఆరోపించారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతా యుతమైన విధానాలు అవసరమని పేర్కొ న్నారు. విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభు త్వం అనుసరిస్తున్న వైఖరిని కూడా సోనియా గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతను దేశ భవిష్యత్తుగా చూడాల్సిందిపోయి దేశద్రోహులుగా చూస్తున్నారని ధ్వజమెత్తారు. జులై 20వ తేదీన విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యవేక్షణలోనే జరిగిందని ఆరోపించారు. అలాగే మోదీ హయాంలో పాఠశాల విద్యకు 50శాతం, ఉన్నత విద్యకు 33 శాతం మేర బ్జడెట్ తగ్గించారని సోనియా గాంధీ దుయ్యబట్టారు. విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలో మోదీ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సోనియాగాంధీ ఆగ్రహించారు.

## విద్యార్థులే నిజమైన దేశభక్తులు

### ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్

### రాహుల్, ప్రియాంకల హర్షం



న్యూఢిల్లీ,జులై 25 : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యారంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరిం చాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# హెచ్-1బీ వీసాలపై అమెరికా సెనేట్‌లో పిడుగు

**మూడేళ్ల పాటు జారీ నిలిపివేతకు కొత్త బిల్లు!**
**ట్రంప్ సర్కారు ప్రతిపాదించిన లక్ష డాలర్ల దరఖాస్తు ఫీజును చట్టబద్ధం చేయాలని డిమాండ్..**
**లాటరీ విధానం రద్దు, ఓపీటీ (OPT) నిలిపివేతకు రిపబ్లికన్ సెనేటర్ సంచలన ప్రతిపాదనలు**

బలగం టీవీ, న్యూఢిల్లీ




అమెరికాలో ఉద్యోగం చేయాలనే కలలు కంటున్న విదేశీ టెక్ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి కోలుకోలేని షాక్ తగిలింది. కొత్తగా హెచ్-1బీ (H-1B) వీసాల జారీని ఏకంగా మూడేళ్ల పాటు పూర్తిగా నిలిపివేయాలంటూ అమెరికా సెనేట్‌లో ఓ సంచలన బిల్లు ప్రవేశపెట్టారు. మొంటానా రాష్ట్రానికి చెందిన రిపబ్లికన్ సెనేటర్ టిమ్ షీహీ ఈ బిల్లును తీసుకొచ్చారు. దీనికి 'ఎండ్ హెచ్-1బీ అబ్యూజ్ యాక్ట్' (End H-1B Abuse Act) అని పేరు పెట్టారు. హెచ్-1బీ వీసా విధానం తన అసలు ఉద్దేశాల నుంచి పక్కదారి పట్టిందని, అమెరికా స్థానిక కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికే ఈ బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు.

రూ. లక్ష డాలర్ల భారీ ఫీజుకు చట్టబద్ధత?

గతంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఒక్కో హెచ్-1బీ దరఖాస్తు పిటిషన్‌పై లక్ష డాలర్ల (సుమారు రూ. 84 లక్షలు) భారీ ఫీజును శాశ్వతంగా అమలు చేసేలా ఈ చట్టంలో చేర్చాలని బిల్లులో పేర్కొన్నారు. అయితే, ఈ ఫీజు విధింపుపై ఇప్పటికే అమెరికాలో పెద్ద న్యాయవివాదం నడుస్తోంది. కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్) అనుమతి లేకుండా ఇలాంటి పన్ను విధించే అధికారం ప్రభుత్వానికి లేదంటూ బోస్టన్‌లోని ఫస్ట్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ ఇటీవల తీర్పు ఇచ్చింది. ట్రంప్ యంత్రాంగం దాఖలు చేసిన స్టే అభ్యర్థనను సైతం కోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో సెనేటర్ షీహీ ఏకంగా చట్టం ద్వారానే ఆ ఫీజును శాశ్వతం చేయాలని ప్రతిపాదించడం గమనార్హం.

"హెచ్-1బీ కార్యక్రమం కేవలం ప్రత్యేక నైపుణ్యాలు ఉన్న ఉద్యోగాల్లో సిబ్బంది కొరతను తీర్చడానికి ఉద్దేశించినది. అమెరికా ఉద్యోగులను తొలగించి, తక్కువ ఖర్చుతో విదేశీ కార్మికులను నియమించుకోవడానికి దీనిని ఒక సాధనంగా ఉపయోగించకూడదు."

— టిమ్ షీహీ, రిపబ్లికన్ సెనేటర్

లాటరీ విధానానికి స్వస్తి.. కొత్త బిల్లులోని ప్రధాన ప్రతిపాదనలు:

ఈ కొత్త బిల్లు చట్టంగా మారితే హెచ్-1బీ వీసా వ్యవస్థ పూర్తిగా మారిపోనుంది. అందులోని ప్రధాన ప్రతిపాదనలు ఇవే:

లాటరీ రద్దు - జీతాల ఆధారంగా ఎంపిక: ప్రస్తుతం ఉన్న కమర్షియల్ ర్యాండమ్ లాటరీ విధానాన్ని పూర్తిగా తొలగించి, ఉద్యోగుల జీతాల (వేతనాల) ఆధారంగా వీసాలు ఎంపిక చేయాలి. ఎక్కువ జీతాలు ఇచ్చే కంపెనీలకే ప్రాధాన్యం ఇవ్వాలి.

స్టాఫింగ్ ఏజెన్సీలపై నిషేధం: థర్డ్ పార్టీ స్టాఫింగ్ ఏజెన్సీల ద్వారా హెచ్-1బీ ఉద్యోగులను నియమించే విధానాన్ని పూర్తిగా నిషేధించాలి. అలాగే ఒకేసారి రెండు ఉద్యోగాలు (మూన్‌లైటింగ్) చేసే అవకాశాన్ని రద్దు చేయాలి.

డ్యూయల్ ఇంటెంట్ రద్దు: హెచ్-1బీ వీసాదారులకు ఉన్న 'డ్యూయల్ ఇంటెంట్' విధానాన్ని తొలగించాలి. అంటే భవిష్యత్తులో అమెరికాలో గ్రీన్ కార్డ్ లేదా శాశ్వత నివాసం పొందే ఉద్దేశంతో ఈ వీసాను కొనసాగించే అవకాశాలను పరిమితం చేయాలి. దీనివల్ల వీసా ఉన్నవారి కుటుంబ సభ్యులను (డిపెండెంట్స్) అమెరికా తీసుకురావడానికి అనుమతించే నిబంధనలపై తీవ్ర ప్రభావం పడుతుంది.

విద్యార్థుల ఓపీటీ (OPT) నిలిపివేత: విదేశీ విద్యార్థులకు చదువు పూర్తయ్యాక అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు ఇచ్చే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (OPT) వంటి కీలక కార్యక్రమాలను కూడా నిలిపివేయాలని బిల్లు సూచించింది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో నిషేధం: అమెరికా ప్రభుత్వ సంస్థలు విదేశీ నాన్-ఇమిగ్రెంట్ వీసాదారులను ఉద్యోగాల్లో నియమించకుండా గట్టి నిరోధాన్ని ప్రతిపాదించారు.

భారత్‌పై పడనున్న తీవ్ర ప్రభావం

అమెరికా కంపెనీలలో సాంకేతిక నిపుణుల కొరతను తీర్చడానికి ఈ హెచ్-1బీ వీసాలు ఎంతో కీలకమైనవి. ముఖ్యంగా భారత్, చైనా దేశాల నుండి ప్రతి ఏటా వేలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు దీని ద్వారానే అమెరికాకు వెళ్తుంటారు. అయితే, కొన్ని కంపెనీలు తక్కువ జీతాలకే విదేశీయులను తెచ్చుకుంటూ స్థానిక అమెరికన్ల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తున్నాయనే విమర్శలను బేస్ చేసుకుని ఈ బిల్లు తెచ్చారు. ప్రస్తుతం ఈ బిల్లుకు ఇమ్మిగ్రేషన్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ రిఫార్మ్ వంటి శక్తివంతమైన సంస్థలు మద్దతు ప్రకటించడంతో రానున్న రోజుల్లో ఇది ఎలాంటి మలుపులు తిరుగుతుందోనన్న ఆందోళన టెక్ వర్గాల్లో మొదలైంది



# బంగ్లాదేశ్ రాజకీయాల్లో కుదుపు

**అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దిన్ సంచలన రాజీనామా!**
**తీవ్ర అనారోగ్య కారణాల వల్లే తప్పుకుంటున్నట్లు ప్రకటన..**
**స్పీకర్‌కు లేఖ సమర్పణ.. కొత్త అధ్యక్షుడి ఎంపిక వరకు తాత్కాలిక బాధ్యతల్లో స్పీకర్ హఫీజ్ ఉద్దీన్**

బలగం టీవీ, న్యూఢిల్లీ

బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఊహించని భారీ కుదుపు చోటుచేసుకుంది. ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దిన్ శుక్రవారం తన అధ్యక్ష పదవికి సంచలన రాజీనామా చేశారు. తన రాజీనామాకు తీవ్రమైన అనారోగ్య సమస్యలే కారణమని ఆయన వెల్లడించారు. మరో రెండేళ్ల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ విధమైన కీలక నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు అంతర్జాతీయ వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అత్యంత ఆప్తుడిగా, మద్దతుదారుడిగా షహబుద్దిన్‌కు పేరుంది. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం తారిక్ రెహమాన్ నేతృత్వంలో అధికారంలో ఉన్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రభుత్వంలో ఆయన ఇమడలేకనే ఈ నిర్ణయం తీసుకున్నారనే రాజకీయ ఊహాగానాలు సైతం బలంగా వినిపిస్తున్నాయి.

బంగాభవన్ అధికారిక ప్రకటన.. స్పీకర్‌కు లేఖ

రాజకీయ ఊహాగానాలు ఎలా ఉన్నప్పటికీ, తీవ్ర అనారోగ్య సమస్యల కారణంగానే మహ్మద్ షహబుద్దిన్ తన పదవికి రాజీనామా చేశారని బంగ్లాదేశ్ అధ్యక్షుడి అధికారిక నివాసమైన 'బంగాభవన్' ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. షహబుద్దిన్ తన అధికారిక రాజీనామా లేఖను బంగ్లాదేశ్ పార్లమెంట్ స్పీకర్ మేజర్ (రిటైర్డ్) హఫీజ్ ఉద్దీన్ అహ్మద్‌కు లాంఛనంగా సమర్పించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శారీరక, మానసిక అసమర్థత వల్లే.. రాజీనామా లేఖలో వ్యాధి వివరాలు:

తాను ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆరోగ్య సమస్యలను మహ్మద్ షహబుద్దిన్ తన రాజీనామా లేఖలో కూలంకషంగా వివరించారు.

"నేను ప్రస్తుతం తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాను. నాకు గుండె జబ్బు, అధిక రక్తపోటు, మధుమేహం (షుగర్), మరియు తీవ్రమైన మూత్రపిండాల (కిడ్నీ) సమస్యలు ఉన్నాయి. గతంలో నాకు గుండెకు బైపాస్ సర్జరీ కూడా జరిగింది. వీటన్నింటికీ తోడు ఇటీవల జరిపిన వైద్య పరీక్షల్లో నాకు 'ఆటోనామిక్ న్యూరోపతి' (Autonomic Neuropathy) అనే అరుదైన నరాల సమస్య ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఈ వ్యాధి ప్రభావం వల్ల నేను అప్పుడప్పుడు కాసేపటి పాటు పూర్తిగా స్పృహ కోల్పోతుంటాను. ఇలాంటి పరిస్థితుల్లో కలిగిన శారీరక, మానసిక అసమర్థత కారణంగా అధ్యక్షుడి వంటి అత్యున్నత పదవీ బాధ్యతలను నిర్వర్తించడం ఇక నా వల్ల కాదు. నాకు దీర్ఘకాలిక చికిత్స అవసరం ఉంది. అందుకే రాజ్యాంగంలోని ఆర్టికల్ 50(3) నిబంధనల ప్రకారం నా పదవికి రాజీనామా చేస్తున్నాను."

— మహ్మద్ షహబుద్దిన్, బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు

90 రోజుల్లో కొత్త అధ్యక్షుడు.. తాత్కాలిక బాధ్యతల్లో స్పీకర్

బంగ్లాదేశ్ రాజ్యాంగ నిబంధనల ప్రకారం, అధ్యక్షుడు రాజీనామా చేసిన తరుణంలో కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యేంత వరకు పార్లమెంట్ స్పీకర్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఆ తర్వాత రాజ్యాంగ ప్రక్రియను అనుసరిస్తూ జాతీయ పార్లమెంట్ సభ్యులు (ఎంపీలు) దేశానికి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి రాజ్యాంగం ప్రకారం 90 రోజుల గడువు ఉంటుంది.

రాజ్యాంగంలోని 50, 54 అధికరణల ప్రకారం స్పీకర్‌కు రాజీనామా లేఖ అందిన వెంటనే కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ అధికారికంగా మొదలవుతుంది. ప్రస్తుతం బంగ్లాదేశ్ జాతీయ పార్లమెంట్‌లో అధికార బీఎన్‌పీ (BNP) కి స్పష్టమైన మెజారిటీ ఉండటంతో, తదుపరి కొత్త అధ్యక్షుడి ఎంపికలో ఆ పార్టీయే అత్యంత కీలక పాత్ర పోషించనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో భారీ కార్చిచ్చు



**2.50 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు!**
**శుక్రవారం నుంచి వేగంగా వ్యాపిస్తున్న మంటలు..**
**స్పెయిన్‌లో అత్యవసర పరిస్థితి ప్రకటన..**
**సహాయం కోరిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్**

బలగం టీవీ, న్యూఢిల్లీ

ఫ్రాన్స్, స్పెయిన్ (France, Spain) సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో సంభవించిన భారీ కార్చిచ్చు (Wildfire) ఇరు దేశాలను వణకిస్తోంది. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఈ కార్చిచ్చు వాతావరణ పరిస్థితుల కారణంగా అత్యంత వేగంగా విస్తరిస్తోంది. మంటల తీవ్రతకు దట్టమైన పొగ చుట్టుపక్కల ప్రాంతాలకు అలుముకోవడంతో గాలి నాణ్యత పూర్తిగా క్షీణించింది. దీంతో ఇరు దేశాల అధికారులు తీవ్ర అప్రమత్తమయ్యారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా ఇప్పటివరకు దాదాపు 2.50 లక్షల మంది స్థానిక ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు.. యూరోపియన్ యూనియన్ సాయం

అడవులను దహించివేస్తున్న ఈ భారీ మంటలను అదుపు చేయడానికి వందల సంఖ్యలో అగ్నిమాపక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. రంగంలోకి దిగిన ఫ్రాన్స్ సైన్యం ప్రత్యేక హెలికాప్టర్ల ద్వారా కొన్ని వేల లీటర్ల నీటిని మంటలపై గుమ్మరిస్తూ అదుపు చేసేందుకు ప్రయత్నిస్తోంది. అయితే వాతావరణం సహకరించకపోవడం, గాలి వేగం ఎక్కువగా ఉండటంతో మంటలను ఆర్పడం అగ్నిమాపక సిబ్బందికి పెద్ద సవాల్‌గా మారింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కార్చిచ్చును అదుపు చేసేందుకు తక్షణమే సాయం అందించాల్సిందిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ యూరోపియన్ యూనియన్ (EU) ను అభ్యర్థించారు.

నియంత్రణ దాటిన మంటలు.. స్పెయిన్‌లో ఎమర్జెన్సీ!

స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ సమీపంలో మంటలు అత్యంత భీకరంగా ఎగసిపడుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల మంటలను అదుపు చేయడం సాధ్యపడట్లేదని అధికారులు చేతులెత్తేశారు. ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో స్పెయిన్ ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని (National Emergency) ప్రకటించింది.

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం?

ఈ ఘోర ప్రమాదానికి గల కారణాలపై స్పానిష్ పోలీసులు ప్రాథమిక సమాచారాన్ని వెల్లడించారు. శుక్రవారం ఒక ట్రాక్టర్ డ్రైవర్ అటవీ ప్రాంతానికి సమీపంలో నిప్పు అంటించాడని, ఆ చిన్న మంట కాస్తా క్షణాల వ్యవధిలో దావానలంగా మారి అడవి మొత్తానికి వ్యాపించిందని పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం సైన్యం, విపత్తు నిర్వహణ బృందాలు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశాయి.



# చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం

**సేవలు నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల ఫిర్యాదులు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

ప్రపంచవ్యాప్తంగా చాట్‌జీపీటీ సేవల్లో శనివారం అంతరాయం ఏర్పడింది. వెబ్, మొబైల్ యాప్, డెవలపర్ ఏపీఐ సేవలు సరిగా పనిచేయకపోవడంతో అనేక దేశాల వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మధ్యాహ్నం సుమారు 2.54 గంటల నుంచి ఈ సమస్య ప్రారంభమైనట్లు వినియోగదారులు సోషల్ మీడియా వేదికలపై వెల్లడించారు. లాగిన్ కావడం, పాత చాట్స్‌ను యాక్సెస్ చేయడం, కొత్త సంభాషణలు ప్రారంభించడం వంటి సేవలు నిలిచిపోయాయని ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

డౌన్‌డిటెక్టర్‌కు కూడా నిమిషాల వ్యవధిలో వందల సంఖ్యలో ఫిర్యాదులు నమోదయ్యాయి. ఐఓఎస్, ఆండ్రాయిడ్ యాప్‌లతో పాటు వెబ్, డెవలపర్ ఏపీఐ సేవలు కూడా ప్రభావితమైనట్లు వెల్లడైంది. స్థానిక ఇంటర్నెట్ సమస్య కంటే గ్లోబల్ సర్వర్లలో లోపం కారణంగానే ఈ అంతరాయం ఏర్పడినట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.అమెరికా, బ్రిటన్ సహా పలు దేశాల్లో సేవలు దెబ్బతిన్నట్లు సమాచారం. ఈ అంతరాయాన్ని ఓపెన్‌ఏఐ ధృవీకరిస్తూ, "ఎలివేటెడ్ ఎర్రర్ రేట్స్" కారణంగా సమస్య తలెత్తిందని తెలిపింది. సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు తమ సాంకేతిక బృందాలు పనిచేస్తున్నాయని సంస్థ వెల్లడించింది. ఇటీవల కూడా చాట్‌జీపీటీ ఇమేజ్ జనరేషన్ సేవల్లో తలెత్తిన అంతరాయాన్ని కొన్ని గంటల్లోనే ఓపెన్‌ఏఐ పరిష్కరించిన విషయం తెలిసిందే.

# జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీలో కీలక ప్రతిపాదనల ఆమోదం



బలగం టీవీ, హైదరాబాద్

జీహెచ్‌ఎంసీ 6వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశంలో నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, సమాచార సాంకేతికత, పౌర సేవల మెరుగుదలకు సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో రోడ్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, డిజిటల్ సేవలు, పారిశుధ్య వ్యవస్థ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.

గౌలిపురలోని చిన్న జంతువుల వధశాల ఆధునీకరణ, సంజీవయ్య పార్క్ ఆర్‌ఓబి, రసూల్‌పుర ద్విమార్గ ఫ్లైఓవర్, హైదర్‌షకోటలో సీసీ రోడ్లు, బడంగ్‌పేటలో బీటీ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కమిటీ పరిశీలించి ఆమోదించింది. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న రైట్ ఆఫ్ వే (RoW) పోల్ అద్దె ఛార్జీల వసూళ్లపై కూడా నిర్ణయం తీసుకుంది.

స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద స్వచ్ఛతా విజ్ఞాన భాగస్వామి నియామకం, పాఠశాలల్లో ఐటీసీ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో 'వ్యర్థాల నుంచి శ్రేయస్సు' కార్యక్రమం అమలు, జీహెచ్‌ఎంసీ డిజిటల్ సేవలను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్‌కు తరలించడం, పారిశుధ్య, ఎంటమాలజీ సిబ్బందికి మొబైల్ ఆధారిత ముఖ గుర్తింపు బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ ప్రవేశపెట్టే ప్రతిపాదనలకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది.

జూబ్లీహిల్స్ పార్కులను సీఎస్‌ఆర్ కింద దత్తత తీసుకుని నిర్వహించడం, కిస్మత్‌పూర్, బండ్లగూడ జాగీర్, శంషాబాద్ ప్రాంతాల్లో మిస్సింగ్ లింక్ కారిడార్ల అభివృద్ధికి అవసరమైన భూసేకరణతో కూడిన రహదారి అభివృద్ధి ప్రణాళికలపై కూడా సమావేశంలో చర్చించారు. కార్పొరేషన్ ఆమోదం అవసరమైన ప్రతిపాదనలను తదుపరి పరిశీలన కోసం సిఫారసు చేశారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రూ.2,586.67 కోట్ల బడ్జెట్‌కు ఎంఎంసీ ఆమోదం

బలగం టీవీ, హైదరాబాద్




రూ.2,586.67 కోట్ల బడ్జెట్‌కు ఎంఎంసీ ఆమోదం తెలుపుతూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ అంచనాలను 6వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించింది. పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ, రోడ్లు, డ్రయినేజీలు, ఫ్లైఓవర్లు, జంక్షన్ అభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తూ మొత్తం 32 అజెండా అంశాలపై సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు.

తార్నాకలోని హెచ్‌ఎండీఏ కాంప్లెక్స్‌లో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎంసీ స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాప్రాల్‌లో నాగిరెడ్డి చెరువు–కాప్రా చెరువులను అనుసంధానించే స్టోర్మ్ వాటర్ డ్రెయిన్, నాగోల్ పరిధిలో సీసీ రోడ్లు, యూజీడీ పైప్‌లైన్లు, కౌకూర్‌లో బాక్స్ డ్రెయిన్, యాప్రాల్ జంక్షన్ అభివృద్ధి, ఆనంద్ నగర్ 4-లేన్ ఫ్లైఓవర్, హస్తినాపురం–బీఎన్ రెడ్డి నగర్–సాగర్ కాంప్లెక్స్ మీదుగా 6-లేన్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద 500 టీపీడీ సామర్థ్యంతో సీ అండ్ డీ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్, 15 మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్‌ఎఫ్) కేంద్రాలు, 7 ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, పీర్జాదిగూడలో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, శానిటరీ ల్యాండ్‌ఫిల్, కంపోస్ట్, బయో-మీథనేషన్/సీబీజీ, లీచేట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 9 ఆస్పిరేషనల్ టాయిలెట్ల ఏర్పాటుపై సమగ్రంగా చర్చించి ఆమోదించారు.

కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ఐటీ మౌలిక సదుపాయాల నిర్వహణ కోసం తెలంగాణ గవర్నమెంట్ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా ఆరుగురు హార్డ్‌వేర్ ఇంజినీర్ల నియామకానికి కూడా స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

పెద్ద అంబర్‌పేట వార్డు-52 పరిధిలోని దయాకర్ రెడ్డి కాలనీ, హనుమాన్ నగర్, ప్రగతి నగర్, లుంబినీ ఎన్‌క్లేవ్, పద్మావతి కాలనీ, బీబీఆర్ కాలనీ, కేజే టౌన్‌షిప్, మంజీరా కాలనీ, శివసాయి కాలనీ, తెలంగాణ నగర్, భూదాన్ కాలనీ, రత్న కాలనీ, హాతిగూడ, అంజనాద్రి, ఇంద్రప్రస్థ కాలనీ తదితర ప్రాంతాల్లో అంతర్గత సీసీ రోడ్లు, యూజీడీ పైప్‌లైన్ల నిర్మాణానికి ఆమోదం లభించింది. కుంట్లూర్–పెద్ద అంబర్‌పేట రోడ్డు అభివృద్ధికి కూడా అనుమతులు మంజూరయ్యాయి.

మూడు జోన్లలో గుర్తించిన ఆరు పార్కుల నిర్వహణ బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. అదేవిధంగా కారుణ్య నియామకాలు, బాలానగర్–నర్సాపూర్ రోడ్డు విస్తరణ, మచ్చబొల్లారం పరిధిలో సీసీ రోడ్లు, లోతుకుంట–ఆర్‌పీ నిలయం రోడ్డు విస్తరణ, ఆనంద్ నగర్ ఫ్లైఓవర్, కౌకూర్‌లో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం వంటి ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ సర్కిళ్లలో పనిచేస్తున్న 223 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను జీహెచ్‌ఎంసీ నిబంధనలకు అనుగుణంగా పెంచేందుకు పరిపాలనా అనుమతి మంజూరు చేశారు.ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు, ఇంజినీరింగ్, ఫైనాన్స్, వెటర్నరీ, యూబీడీ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల పట్ల ప్రేమతో మెలగాలి

**హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల**

బలగం టీవీ, హైదరాబాద్

జిల్లాలో వయోవృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయతలతో మెలగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. శనివారం జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాస్థాయి వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె పాల్గొని వృద్ధుల సంక్షేమం, రక్షణ చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధుల పోషణ, సంక్షేమం, రక్షణ కోసం ఉన్న 2007 చట్టంతో పాటు ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇటీవల అమల్లోకి వచ్చిన 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ బాధ్యత, పరిరక్షణ చట్టం - 2026' అమలుపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ చట్టం కింద అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, ఎలాంటి ఆలస్యం లేకుండా చట్ట నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వేధింపులు, ఆస్తి వివాదాలు వంటి సంక్షేమ సంబంధిత అంశాల్లో సకాలంలో జోక్యం చేసుకుని సహాయం అందించాలని కలెక్టర్ అన్నారు. వృద్ధులకు సకాలంలో రక్షణ, న్యాయం అందేలా అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వృద్ధులకు ఉన్న చట్టపరమైన హక్కులు, అందుబాటులో ఉన్న పరిష్కార మార్గాలు, సమస్యల పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారుల వివరాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు వయోవృద్ధులకు సంబంధించిన 600 కేసులను విజయవంతంగా పరిష్కరించడం జరిగిందని, ఈ కృషికి గాను జిల్లాకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కిందని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రాజేందర్, ఏసీపీ ఆంజనేయులు, డీఏవో జ్యోతి, ఎన్జీవో ప్రతినిధులు అరుణ్ డేనియల్, రోజీ, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు చెక్...



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసులు సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి 3 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి, వారి నివాసం, ఉపాధి, ప్రస్తుత కార్యకలాపాలపై వివరాలు సేకరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని వారికి సూచించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా కాలనీల్లోకి వచ్చే అనుమానాస్పద వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి కాలనీలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

అలాగే కాలనీల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.

గంజాయి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చిన డీఎస్పీ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు నాగరాజు, గణేష్, రంజిత్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఓదెలలో నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



**ప్రత్యామ్నాయ పంటల సాగుతో నష్టాలు నివారించుకోవాలి: విప్ విజయరామరావు**

**బలగం టీవీ, ఓదెల**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరామరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ప్రారంభించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఓదెల తహసీల్దార్ కార్యాలయం సొంత భవనంలోకి మారింది.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే విజయరామరావు మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని సూచించారు. గత రెండున్నర సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఓదెలకు కోర్టు మంజూరైందని, త్వరలోనే నూతన కోర్టు భవన నిర్మాణం చేపడతామని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలతో నీటి సమస్య ఉండదనే అపోహలో రైతులు ఉండొద్దని హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, గత రెండేళ్లలో ఓదెల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.5.5 కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కూడా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం దశలవారీగా భూ పునఃసర్వే చేపడుతోందన్నారు. పైలట్ ప్రాజెక్టు అనుభవాల ఆధారంగా ప్రస్తుతం ప్రతి జిల్లాలో తొలి దశలో 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికే 23 గ్రామాల్లో భూ పునఃసర్వే ప్రారంభించామని చెప్పారు. ముందుగా గ్రామ సరిహద్దులు ఖరారు చేసి, అనంతరం ఆధునిక సాంకేతిక పరికరాలతో భూముల సర్వే నిర్వహిస్తామని తెలిపారు. సర్వే అనంతరం రైతుల అభ్యంతరాలు స్వీకరించి, అవసరమైన సవరణలు చేసిన తర్వాతే తుది వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తామని వివరించారు. ఈ ప్రక్రియతో దాదాపు 99 శాతం భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాలు సుమారు 2.5 మీటర్లు తగ్గాయని, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో విద్యుత్ సరఫరాపై ప్రభావం పడుతోందన్నారు. గ్రామాల చెరువుల్లో ప్రస్తుతం 15 నుంచి 20 శాతం మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, తహసీల్దార్ బానోత్ వనజ నాయక్, ఎంపీడీవో వెన్నెపు రెడ్డి అనిల్ రెడ్డి, సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకులు ధోరణి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు...

**బలగం టీవీ, వేములవాడ:**

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇంటి ముట్టడి చేస్తామని బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఇలాంటి రాజకీయ ధోరణిని వెంటనే మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్ మధు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి బెదిరింపు వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి వ్యక్తిగత లక్ష్యాలతో రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముసుకు ముకుంద్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, పీర్ మహమ్మద్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## "గిఫ్ట్ ఏ స్మైల్" తో క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కౌన్సిలర్ నీరజ పూర్ణచందర్..



**బలగం టీవీ, సిరిసిల్ల:**

"గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని బి.వై.నగర్ 34వ వార్డుకు చెందిన కుడిక్యాల సతీష్ కుటుంబానికి 17వ వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ ఆర్థిక సహాయం అందించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సతీష్ వైద్య ఖర్చుల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి, వారి కుమార్తె ఉన్నత చదువుల నిమిత్తం రూ.5,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా సతీష్ కుమార్తె మాట్లాడుతూ.. తనకు ఇంజినీరింగ్ చదవాలనే కోరిక ఉన్నప్పటికీ, తండ్రికి క్యాన్సర్ రావడంతో ఏర్పడిన ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రస్తుతం సిరిసిల్లలోనే డిగ్రీ చదవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీనిపై గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ ఆ విద్యార్థినికి ధైర్యం చెబుతూ, ఆమె చదువు కొనసాగించేందుకు అవసరమైన సహాయం అందించే విషయాన్ని బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక శాసన సభ్యులు కల్వకుంట్ల తారక రామారావు దృష్టికి తీసుకువెళ్లి సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, పంతం శ్రీనివాస్, కోమాకుల ఆంజనేయులు, గుర్రాల నర్సింలు, గజ్జెల్లి సత్యనారాయణ, ఆడెపు రవి, శ్రీపతి సురేష్, సింగం శరత్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం యువత, విద్యార్థుల విజయం..




**- బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు రాజకీయ అంశాలపై స్పందించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా యువత, నీట్ విద్యార్థుల విజయమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నీట్ విద్యార్థులకు మద్దతుగా నిర్వహించిన ధర్నాకు భారీగా యువత, విద్యార్థులు హాజరుకావడం ప్రజా మద్దతుకు నిదర్శనమని అన్నారు. విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని కేటీఆర్ చేసిన డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడాన్ని బీఆర్ఎస్ స్వాగతిస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై తోట ఆగయ్య విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఒకవైపు తన కుమారుడికి సంబంధించిన కేసు, మరోవైపు కరీంనగర్‌లో వరుస భారీ చోరీల ఘటనలతో ప్రజల దృష్టి మరల్చేందుకు కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.ధర్మేంద్ర ప్రధాన్ మాదిరిగానే బండి సంజయ్ కూడా నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో బండి సంజయ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఇందిరా పార్క్ వద్ద నీట్ విద్యార్థులకు మద్దతుగా కేటీఆర్ చేపట్టిన ధర్నాకు తరలివచ్చిన యువత, విద్యార్థి నాయకులు, బీఆర్ఎస్ యూత్ నాయకులకు తోట ఆగయ్య ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, న్యాల కొండ రాఘవరెడ్డి, కంబాల మల్లారెడ్డి, గుండ్లపల్లి పూర్ణచందర్, మ్యాన రవి, అడిచెర్ల సాయి, బూర బాలు, గెంట్యాల శ్రీనివాస్, వేముల రాములు, లింగంపల్లి మధుకర్, పంగ రవి, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలను తిప్పికొడతాం..

**బిఆర్ఎస్ పనికిరాని రాజకీయాలు..**

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మబోయిన సువీన్ యాదవ్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరుగుతున్న ప్రజా సంక్షేమాన్ని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేస్తున్న అభివృద్ధిని, నియోజకవర్గ వ్యాప్తంగా వస్తున్న పేరును చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మరియు ఆయన వర్గీయులు అభూత కల్పనలతో, అసత్య ఆరోపణలతో మీడియా ముందుకు వస్తున్నారు. పదవి పోయినా ఇంకా అధికార గర్వం, అహంకారం తగ్గని బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో వైషమ్యాలు పెంచేందుకు కుట్రలు పన్నుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా నిత్యం అసత్యాలు ప్రచారం చేస్తూ, ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతూ మళ్లీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఊరుకునేది లేదు. ఖబర్దార్ బీఆర్ఎస్ నాయకులారా... కాంగ్రెస్ నాయకులపై, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకోం. మీ బుద్ధి మార్చుకోకపోతే, కాంగ్రెస్ నాయకులను, ప్రభుత్వాన్ని రెచ్చగొట్టాలని చూస్తే... బిఆర్ఎస్ నాయకులను గ్రామాల నుండి తరిమి తరిమి కొడతాం అని ఈ సందర్భంగా తీవ్రంగా హెచ్చరిస్తున్నాం! ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రజాస్వామ్యబద్ధంగా, నిష్పక్షపాతంగా పాలన అందిస్తున్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదు. ప్రతి చిన్న విషయానికి కాంగ్రెస్ కార్యకర్తలపై రౌడీయిజం, గుండాగిరి అని ముద్ర వేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు తమ తప్పుడు ప్రచారాలు, దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. ఇలాంటి విమర్శలతో ప్రజలను మభ్యపెట్టలేరని స్పష్టం చేస్తున్నానాని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మబోయిన సువీన్ యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రస్తుతం ఆయిల్ ఫామ్ పంట లాభదాయకమైనది..

**- సన్న చిన్నకారు రైతు బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాన్ని చేసుకోవాలి..**

**- తహశీల్దార్, మండల ప్రత్యేక అధికారి మరియు జిల్లా ఉద్యానవన అధికారి**

**బలగం టీవీ, బోయినిపల్లి:**



ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు తీసుకునే జాగ్రత్తల గురించి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శనివారం రోజున రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ: బోర్వెల్ ఉన్న ప్రతి ఒక్క సన్న, చిన్నకారు రైతు బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాన్ని చేసుకోనీ, నీటిని ఆదా చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి మరియు జిల్లా ఉద్యానవన అధికారి మాట్లాడుతూ: ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆయిల్ ఫామ్ పంట లాభదాయకమైనది మరియు నీళ్లు తక్కువ తీసుకునే పంట మరియు వరి ఎకరం పండించే దానిలో ఐదు ఎకరాలు ఆయిల్ ఫామ్ పండించుకోవచ్చని, అలాగే ప్రస్తుతం నీరు తక్కువగా వుంది కాబట్టి కూరగాయలు మరియు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.

ఏవో మాట్లాడుతూ: రైతులు తమ మొత్తం విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా, కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.తక్కువ నీటితో సాగు చేయగల కంది, పొద్దు తిరుగుడు, ఆముదం పంటలని ఆగస్టు 15 వరకు వేసుకోవచ్చని, ఆగస్టు 15 నుండి నువ్వు పంట వేసుకోవచ్చని తెలిపారు. ఏపీఓ సబిత మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వానచినుకుని సంరక్షించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని, కనుక వీబీజి రామ్ పథకం కింద రైతులు తమ బోర్ల చుట్టూ రీచార్జ్ గుంతలను తవ్వుకోవాలని, దీనికి అయ్యే ఖర్చు సుమారు 36000/- ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు 100 శాతం రాయితీపై అందచేస్తుందని తెలిపారు.పంట కుంటలు వరద నీటిని నిల్వ చేసుకోవడానికి ఒక గుంట స్థలంలో 72000/- రూపాయలతో 100 శాతం రాయితీపై నిర్మించుకోవచ్చని, ప్రభుత్వ భూముల్లో, కొండ ప్రాంతాల్లో ఊరకుంట నిర్మాణాలు, ఇంటి నుండి వచ్చే మురుగు నీటిని ఆదా చేసుకోవడానికి ఇంకుడు గుంత 6,700 రూపాయలతో వీబీజి రామ్ పథకం కింద నిర్మించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇరువాల సంధ్య, జిల్లా ఉద్యానవనాధికారి మరియు మండల ప్రత్యేక అధికారి శరత్ బాబు, తహశీల్దార్ జలీల్ మోహియుద్దీన్, వ్యవసాయ అధికారి ప్రణీత, ఏపీవో సబిత, ఏఈఓ రవళి, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

## మోయతుమ్మెద వాగులో ఇసుక తవ్వకాలపై అధికారుల పరిశీలన

**కలెక్టర్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో తనిఖీ**

**బలగం టీవీ, చిగురుమామిడి**



చిగురుమామిడి మండలం రామంచ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగులో జరుగుతున్నట్లు వచ్చిన అక్రమ ఇసుక తవ్వకాల ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు షర్మిల, జల కుమారి శనివారం ఇరిగేషన్, మైనింగ్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఎఫ్ఆర్ఎల్ ప్రాజెక్టు, ఎఫ్‌టీఎల్ పూడికతీత పనుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు మోయతుమ్మెద వాగును పరిశీలించి గ్రామ సర్పంచ్ ఒంటెల కిషన్‌రెడ్డి, రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రస్తుతం వాగులో ఎలాంటి ఇసుక తవ్వకాలు జరగడం లేదని, గ్రామం నుంచి ఎవరూ ఫిర్యాదు చేయలేదని అధికారులకు తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా రామంచ శివారులోని మోయతుమ్మెద వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే అడ్డుకుంటామని సర్పంచ్ ఒంటెల కిషన్‌రెడ్డి అధికారులకు హామీ ఇచ్చారు.

పరిశీలనలో ఇరిగేషన్ ఈఈ, మైనింగ్ ఏడీ వెంకట్‌రెడ్డి, చిగురుమామిడి, సైదాపూర్ తహసీల్దార్లు కొడం కనకయ్య, శ్రీనివాస్ గౌడ్, ఎస్సై జగదీశ్వర్, ఉపసర్పంచ్ గీట్ల తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు రాచకొండ సంపత్, దాసరి రవి, చెరుకు ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో దోపిడీ దొంగలను వారం రోజుల్లో పట్టుకోవాలి

**లేకుంటే సీపీ కార్యాలయం ఎదుట ధర్నా**

**మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**బలగం టీవీ, కరీంనగర్**



కరీంనగర్ నగరంలో వరుస దోపిడీలు జరుగుతున్నా పోలీసులు సమర్థంగా స్పందించడం లేదని, వారం రోజుల్లోగా నిందితులను అరెస్టు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు.ఇటీవల భగత్‌నగర్ చౌరస్తాలో దోపిడీకి గురైన మున్నాభాయ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి, బాధితుల నుంచి ఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడిన ఆయన, నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, వరుస దోపిడీలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.బాధితులు మాట్లాడుతూ, జూన్ నెలలో తమ కారు చోరీకి గురైనప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని తెలిపారు. అప్పుడే దొంగలను గుర్తించి ఉంటే ఇప్పుడు ఇంటిపై దాడి జరిగేది కాదన్నారు. కారు ఎత్తుకెళ్లిన వ్యక్తులే పథకం ప్రకారం ఇంటిపై దాడి చేసి కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి పాల్పడి సుమారు 62 తులాల బంగారం, రూ.25 లక్షల నగదును దోచుకెళ్లారని వివరించారు. అనుమానితుల సీసీటీవీ చిత్రాలు అందించినప్పటికీ పోలీసులు వారిని గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గతంలో పీఎంజే జ్యువెలర్స్‌లో జరిగిన దోపిడీ కేసులోనూ నిందితులను పట్టుకోవడంలో, దోచుకున్న ఆస్తి రికవరీలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై చూపుతున్న శ్రద్ధ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణపై కనిపించడం లేదన్నారు. గతంలో కరీంనగర్ సురక్షిత నగరంగా ఉండేదని, ప్రస్తుతం దోపిడీ దొంగలకు అడ్డాగా మారిందని విమర్శించారు.దోపిడీ కేసు నిందితులను వారం రోజుల్లోగా అరెస్టు చేయాలని, లేకపోతే సీపీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కరీంనగర్ టౌన్ ఏసీపీకి ఫోన్ చేసి కేసు పురోగతిపై ఆరా తీశారు. భయాందోళనలో ఉన్న బాధిత కుటుంబానికి పోలీసు శాఖ తక్షణ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.




# పొట్టి క్రికెట్‌లో టీమిండియా 'ప్రపంచసామ్రాజ్యం'.. సరికొత్త చరిత్ర!

**మూడేళ్లుగా 200+ పరుగుల సునామీతో రికార్డుల వేట**

బలగం టీవీ, న్యూఢిల్లీ

అంతర్జాతీయ పొట్టి క్రికెట్ (టీ20) ఫార్మాట్‌ను భారత జట్టు శాసిస్తోంది. ఆరంభ సీజన్ (2007) టీ20 వరల్డ్‌కప్‌తో మొదలుపెట్టి, ఇటీవలే వరుసగా రెండు పర్యాయాలు (2024, 2026) ప్రపంచ విజేతగా నిలిచిన టీమిండియా.. ఇప్పుడు రికార్డు స్థాయిలో రెండొందల స్కోర్లు బాదుతూ మరే జట్టుకూ సాధ్యం కాని రీతిలో దూసుకుపోతోంది. శనివారం హరారేలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో జింబాబ్వేను 90 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించిన 'మెన్ ఇన్ బ్లూ'.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ 219 పరుగులు చేయడం ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది.

**మూడేళ్లుగా 200+ పరుగుల సునామీ:**

టీ20 క్రికెట్ చరిత్రలో ఒకే క్యాలెండర్ ఇయర్ లో అత్యధిక సార్లు 200 అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన తన సొంత రికార్డును (2024లోని 9 సార్లు) భారత్ ఈ మ్యాచ్‌తో సమం చేసింది. అంతేకాదు, వరుసగా మూడు సంవత్సరాలలో 7 లేదా అంతకంటే ఎక్కువ సార్లు రెండొందల మార్కును దాటిన ప్రపంచంలోని ఏకైక జట్టుగా భారత్ రికార్డులకెక్కింది. 2023లో 7 సార్లు, 2024లో 9 సార్లు ఈ మార్కును దాటిన టీమిండియా.. ప్రస్తుత 2026 సంవత్సరంలో మరో ఐదు నెలల సమయం మిగిలి ఉండగానే అప్పుడే 9వ సారి 200 ప్లస్ స్కోరుతో ప్రత్యర్థి జట్లను భయపెట్టింది. ఓవరాల్‌గా టీ20ల్లో 52 సార్లు రెండొందల మార్కు దాటిన తొలి జట్టుగా భారత్ అగ్రస్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా 29 సార్లతో చాలా వెనుకబడి రెండో స్థానంలో ఉంది.

ఒక ఏడాదిలో అత్యధిక సార్లు 200+ కొట్టిన జట్లు:
భారత్: 9 సార్లు (2024లో), 9 సార్లు (2026లో - ఇంకా ఐదు నెలలు మిగిలివుంది)
భారత్ / జపాన్ / ఆస్ట్రేలియా: 7 సార్లు (వరుసగా 2023, 2024, 2025 లలో)
ఇంగ్లండ్ / వెస్టిండీస్ / దక్షిణాఫ్రికా: 6 సార్లు (వివిధ సంవత్సరాల్లో)

# జింబాబ్వేను చిత్తు చేసిన భారత్..

## మరో మ్యాచ్ ఉండగానే టీ20 సిరీస్ కైవసం!

**ఇషాన్ కిషన్ (81), తిలక్ వర్మ (60)**
**మెరుపు బ్యాటింగ్..**
**బంతితో విజృంభించిన**
**అభిషేక్ శర్మ, ప్రిన్స్ యాదవ్**

బలగం టీవీ, న్యూఢిల్లీ



వరుసగా రెండు వైట్‌వాష్‌ల పరాజయాల నుంచి కోలుకున్న భారత యువ జట్టు అద్భుత ప్రదర్శనతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. శనివారం జరిగిన కీలక పోరులో జింబాబ్వేను చిత్తుగా ఓడించి, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను తన ఖాతాలో వేసుకుంది అయ్యర్ సేన. తొలుత బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్, తిలక్ వర్మల మెరుపు అర్ధశతకాలతో భారీ స్కోరు సాధించిన టీమిండియా.. అనంతరం బౌలింగ్‌లో ప్రిన్స్ యాదవ్, అభిషేక్ శర్మల ధాటికి ప్రత్యర్థిని 90 పరుగుల తేడాతో మట్టికరిపించింది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టుకు ఆశించిన ఆరంభం లభించలేదు. టాపార్డర్ త్వరగానే విఫలమైనప్పటికీ, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (81 పరుగులు), యువ సంచలనం తిలక్ వర్మ (60 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి జట్టును ఆదుకున్నారు. జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడుతూ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించారు. వీరిద్దరి వీరోచిత బ్యాటింగ్ సాయంతో భారత్ రికార్డు స్థాయిలో 52వ సారి రెండొందల మార్కును దాటి, నిర్ణీత ఓవర్లలో 219 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది.



లక్ష్య చేధనలో కుప్పకూలిన జింబాబ్వే: 220 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఇన్నింగ్స్‌ను వేగంగానే ప్రారంభించింది. ఓపెనర్లు బెన్నెట్ (32), బెన్ కరన్ (1) దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించగా, అంతర్జాతీయ అరంగేట్రం చేసిన పేసర్ యశ్ ఠాకూర్ తొలి బ్రేక్‌త్రూ అందించాడు. ప్రమాదకరంగా మారుతున్న బెన్నెట్‌ను అవుట్ చేసి భారత్‌కు మొదటి వికెట్ అందించగా, ఆ తర్వాతి ఓవర్లోనే కరన్‌ను ప్రిన్స్ యాదవ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో డియాన్ మైర్స్ (12) బౌల్డ్ అవ్వడంతో జింబాబ్వే 58 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో జట్టును నడిపించాల్సిన కెప్టెన్ సికందర్ రజాను (0) ప్రిన్స్ యాదవ్ డకౌట్‌గా వెనక్కి పంపడంతో ఆతిథ్య జట్టు పతనం ఖాయమైంది. శివం దూబే వేసిన ఓవర్లో మద్వేరా (2) కెప్టెన్ అయ్యర్ చేతికి చిక్కాడు. చివర్లో రియాన్ బర్ల్ (20) నిలకడగా ఆడే ప్రయత్నం చేసినా తిలక్ వర్మ అతడిని అవుట్ చేశాడు. బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ అభిషేక్ శర్మ (3-17) బంతితో అద్భుతంగా రాణించి మూడు వికెట్లు పడగొట్టాడు. దీంతో జింబాబ్వే 129 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది.

సంక్షిప్త స్కోరు వివరాలు
భారత్: 20 ఓవర్లలో 219 పరుగుల భారీ స్కోరు (ఇషాన్ కిషన్ 81, తిలక్ వర్మ 60*)
జింబాబ్వే: 129 పరుగులకే ఆలౌట్ (బెన్నెట్ 32, రియాన్ బర్ల్ 20; అభిషేక్ శర్మ 3/17, ప్రిన్స్ యాదవ్ 2/10)
ఫలితం: భారత్ 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకుంది.

# సమష్టి ప్రదర్శనతో ఘన విజయం సాధించాం

**కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**

బలగం టీవీ, న్యూఢిల్లీ




జింబాబ్వేపై సాధించిన ఘన విజయంలో ప్రతి ఆటగాడి పాత్ర కీలకమని భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టి ప్రదర్శనతోనే ఈ విజయాన్ని అందుకున్నామని పేర్కొన్నారు.మ్యాచ్ అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేశారని కొనియాడారు. వారు ఆడిన కొన్ని షాట్లు ఎంతో అందంగా ఉన్నాయని, చూసేందుకు కనువిందు చేశాయని అన్నారు. ప్రారంభంలో 180 నుంచి 200 పరుగుల మధ్య స్కోరు సరిపోతుందని భావించినప్పటికీ, జట్టు 220 పరుగులు చేయడం విజయానికి బలమైన పునాది వేసిందన్నారు. బౌలింగ్ గురించి మాట్లాడుతూ, తమ బౌలర్లు మరోసారి కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేసి ప్రత్యర్థిని 130కి పైగా పరుగులకే కట్టడి చేశారని తెలిపారు. మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించిన అంశం అదే అని అన్నారు. యువ జట్టు నిర్భయ ఆటతీరుపై స్పందిస్తూ, ఇదే దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. గత ప్రదర్శనల గురించి ఆలోచించకుండా, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వర్తమానంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రతి మ్యాచ్ కొత్త అవకాశమేనని, తదుపరి పోరుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. చివరి టీ20లో జట్టులో మార్పులపై మాట్లాడుతూ, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, కోచ్‌తో ఇంకా చర్చించాల్సి ఉందన్నారు. అయితే ప్రిన్స్ గాయపడిన నేపథ్యంలో ఒకటి, రెండు మార్పులు ఉండే అవకాశం ఉందని శ్రేయస్ అయ్యర్ వెల్లడించారు.

# భారత్ బ్యాటింగ్ నుంచి పాఠాలు నేర్చుకోవాలి:

**జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా**

బలగం టీవీ, న్యూఢిల్లీ




భారత్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో పరాజయం అనంతరం జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా భారత బ్యాటర్ల ఆటతీరును ప్రశంసిస్తూ, తమ జట్టు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా భారత బ్యాటర్లు ప్రదర్శించిన నైపుణ్యం తమకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

మ్యాచ్ అనంతరం రజా మాట్లాడుతూ, తమ బౌలర్లు కొన్ని దశల్లో బాగా బౌలింగ్ చేసినప్పటికీ, భారత బ్యాటర్లు అద్భుతమైన షాట్లు ఆడి మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకున్నారని అన్నారు. ఫీల్డింగ్‌లో ఇంకా మెరుగుదల అవసరమని, బౌలర్లకు ఫీల్డర్లు మరింత సహకరిస్తే ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఇషాన్ కిషన్ ప్రదర్శనపై స్పందిస్తూ, అతడు గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్నాడని కొనియాడారు. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదని, అయినప్పటికీ ఇషాన్ కిషన్, తిలక్ వర్మ ఇద్దరూ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడారని ప్రశంసించారు. వారి ఆటతీరు నుంచి తమ జట్టు నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు.

220 పరుగుల లక్ష్య ఛేదనపై మాట్లాడుతూ, ఆరంభం నుంచే దూకుడుగా ఆడాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఓపెనర్లు జట్టుకు కావాల్సిన ఆరంభాన్ని అందించారని, అయితే అనుభవలేమి, తప్పుడు షాట్ ఎంపికల కారణంగా కీలక దశలో మ్యాచ్ చేజారిందన్నారు.

తన వ్యక్తిగత ప్రదర్శనపై ఆత్మపరిశీలన చేసిన రజా, గత రెండు టీ20 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా తన బ్యాటింగ్‌తో జట్టును నిరాశపరిచానని అంగీకరించారు. జట్టుకు తన పరుగులు ఎంతో అవసరమని, ఆ బాధ్యతను తాను నెరవేర్చలేకపోయానని చెప్పారు. రానున్న మ్యాచ్‌ల్లో తప్పక మెరుగైన ప్రదర్శన చేసి జట్టు విజయానికి తోడ్పడేందుకు కృషి చేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

# వరల్డ్ జూనియర్ స్క్వాష్‌లో సెమీస్‌కు అనాహత్ సింగ్

**ఈజిప్ట్‌కు చెందిన హబీబా రిజ్క్‌పై 3-1తో విజయం**

బలగం టీవీ, న్యూఢిల్లీ



వరల్డ్ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్స్‌లో భారత యువ క్రీడాకారిణి అనాహత్ సింగ్ అద్భుత ప్రదర్శనతో మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్‌ఫైనల్‌లో ఈజిప్ట్‌కు చెందిన హబీబా రిజ్క్‌పై 3-1 తేడాతో విజయం సాధించి పతకానికి మరో అడుగు దూరంలో నిలిచింది.

19 ఏండ్ల ఢిల్లీకి చెందిన అనాహత్ సింగ్ క్వార్టర్‌ఫైనల్ పోరులో 11-7, 11-5, 6-11, 11-9 స్కోర్లతో హబీబా రిజ్క్‌ను ఓడించింది. తొలి రెండు గేమ్‌లలో ఆధిపత్యం చెలాయించిన అనాహత్, మూడో గేమ్‌ను కోల్పోయినా, నాలుగో గేమ్‌లో తేరుకుని విజయాన్ని ఖాయం చేసింది.

గత ఏడాది ఇదే టోర్నీలో కాంస్య పతకం సాధించిన అనాహత్ సింగ్, ఈసారి అంతకంటే మెరుగైన ఫలితం సాధించి పతకం రంగు మార్చాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. ఆమె సెమీస్ విజయంపై భారత స్క్వాష్ అభిమానుల్లో ఆశలు పెరిగాయి.

# గంభీర్‌పై 'కృష్ణమాచారి శ్రీకాంత్' ఆగ్రహం!

**యువ సంచలనం వైభవ్ కెరీర్‌తో ఆటలాడుకుంటారా?**
**మూడు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడని తప్పించడం ఎంత తెలివితక్కువతనం..**
**హెడ్ కోచ్ వ్యూహాలపై మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఘాటు విమర్శలు**

బలగం టీవీ, న్యూఢిల్లీ



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకుంటున్న నిర్ణయాలపై మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంభీర్ తన అనాలోచిత నిర్ణయాలతో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆత్మవిశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాడని, అతడిని సరిగ్గా హ్యాండిల్ చేయడంలో విఫలమయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక అద్భుతమైన ప్రతిభావంతుడిని డీల్ చేయడంలో టీమ్ మేనేజ్‌మెంట్ వైఖరి సరిగ్గా లేదని మండిపడ్డారు.

వరుస అవకాశాల నిరాకరణ.. ఆపై వేటు!

ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన ప్రదర్శనతో ఆరెంజ్ క్యాప్ అందుకున్న సూర్యవంశీ.. అద్భుత ఫామ్‌లో ఉండగానే ఐర్లాండ్ పర్యటనకు ఎంపికయ్యాడు. అయితే, అక్కడ అతనికి కనీసం ఒక్క మ్యాచ్‌లోనూ అవకాశం ఇవ్వలేదు. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితం చేశారు. ఆ తదుపరి మూడు మ్యాచ్‌ల్లో అవకాశం ఇచ్చినప్పటికీ, వరుసగా విఫలం కావడంతో ఆఖరి మ్యాచ్ నుంచి అతడిని జట్టు నుంచి పూర్తిగా తప్పించారు. గంభీర్ అనుసరించిన ఈ వ్యూహం కుర్రాడి మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని శ్రీకాంత్ ధ్వజమెత్తారు.

"వైభవ్ సూర్యవంశీ చాలా అలవోకగా షాట్లు ఆడగలడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో విఫలమైనా అతను ఒక్క షాట్ కూడా మిస్‌టైమ్ చేయలేదు. ఈ కుర్రాడు నిజంగా చాలా ప్రత్యేకమైనవాడు. ఇంత టాలెంటెడ్ ప్లేయర్‌ను కేవలం మూడు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడని గంభీర్ జట్టు నుంచి తప్పించడం ఎంత తెలివితక్కువతనం? ఇలాంటి వాటివల్ల వైభవ్ ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది." — కృష్ణమాచారి శ్రీకాంత్, మాజీ సెలెక్టర్

జింబాబ్వేపై రికార్డుల వేట.. బుడ్డోడి విధ్వంసం

మరోవైపు, జింబాబ్వే పర్యటనలో భాగంగా జరిగిన తొలి టీ20లో వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో కేవలం 18 బంతుల్లోనే 4 సిక్సర్లు, 4 ఫోర్ల సాయంతో రికార్డ్ హాఫ్ సెంచరీ బాదాడు. తద్వారా అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అతి పిన్న వయస్సులో ఈ ఘనత సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. వైభవ్ ఆడిన ఇన్నింగ్స్ చూసి ముగ్ధుడైన కృష్ణమాచారి శ్రీకాంత్.. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా యువ ఆటగాడిపై ప్రశంసల జల్లు కురిపించారు. విధ్వంసకర బ్యాటింగ్‌తో పరుగులు చేయడం అతనికి చిన్నపిల్లల ఆటలా మారిపోయిందని కితాబిచ్చారు.

పట్టుదల చూసి సెల్యూట్ చేయాల్సిందే..

ఇంగ్లండ్‌తో సిరీస్ ముగిసిన వెంటనే వైభవ్ నేరుగా తన ఇంటికి వెళ్లకుండా రాజస్థాన్ రాయల్స్ క్యాంప్‌కు తరలివెళ్లాడని శ్రీకాంత్ గుర్తు చేశారు. "తనకున్న షార్ట్ బాల్ సమస్యపై నెట్స్‌లో తీవ్రంగా శ్రమించాడు. తాను ఎంత ప్రత్యేకమైన ఆటగాడినో ప్రపంచానికి నిరూపించడానికి నిరంతరం బ్యాటింగ్‌ను మెరుగుపరుచుకున్నాడు. అతని డెడికేషన్‌కు సెల్యూట్ చేయాల్సిందే" అని కొనియాడారు.

పరుగులు చేయడం పిల్లలాట!

"సాధారణంగా ఏ ఆటగాడైనా వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైతే, జట్టులో తన స్థానాన్ని కాపాడుకోవడానికి తర్వాతి మ్యాచ్‌లో సింగిల్స్, డబుల్స్ తీస్తూ సేఫ్ గేమ్ ఆడటానికి ప్రయత్నిస్తాడు. కానీ వైభవ్ సూర్యవంశీ అలాంటివేమీ పట్టించుకోలేదు. ఒత్తిడిని అధిగమించి ఏకంగా 250 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేయడం అసాధారణం. 18 బంతుల్లో 50 పరుగులు చేయడం వైభవ్‌కు చిన్న పిల్లల ఆట అయిపోయింది, ఇదే అతని అసలైన గొప్పతనం" అని శ్రీకాంత్ స్పష్టం చేశారు. అయితే, జింబాబ్వేతో జరగబోయే తదుపరి మ్యాచ్‌లకు టీమిండియా మేనేజ్‌మెంట్ ఎలాంటి తుది జట్టును ఎంపిక చేయబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ బోణీ..

**పారా పవర్‌లిఫ్టింగ్‌లో జండు కుమార్‌కు కాంస్యం!**
**కూరగాయల వ్యాపారి కొడుకు నుంచి అంతర్జాతీయ వేదికపై పతకం దాకా..**
**ఒడిదొడుకులను అధిగమించి దేశానికి తొలి మెడల్ అందించిన నలందా కుర్రాడు**

బలగం టీవీ, న్యూఢిల్లీ




కామన్వెల్త్ గేమ్స్-2026 (CWG-2026)లో భారత పతకాల ఖాతా తెరుచుకుంది. పారా పవర్‌లిఫ్టర్ జండు కుమార్ దేశానికి తొలి పతకాన్ని అందించి సరికొత్త చరిత్ర సృష్టించాడు. శనివారం జరిగిన పురుషుల హెవీవెయిట్ కేటగిరీ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జండు.. కాంస్య (Bronze) పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

హోరాహోరీ పోరు.. స్వల్ప తేడాతో చేజారిన స్వర్ణం

72.4 కిలోల బరువున్న జండు కుమార్ పోటీల్లో తన వ్యూహాత్మక ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తన రెండో ప్రయత్నంలో ఏకంగా 190 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి దేశానికి పతకాన్ని ఖాయం చేశాడు. ఆ తర్వాత మూడో ప్రయత్నంలో 196 కిలోలు ఎత్తేందుకు ప్రయత్నించినప్పటికీ, స్వల్ప తేడాతో అది విఫలమైంది. ఈ పోటీల్లో చాలా సమయం పాటు పట్టికలో అగ్రస్థానంలో కొనసాగిన జండు, చివరి రౌండ్లలో గట్టి పోటీ ఎదురవడంతో మూడో స్థానానికి పరిమితమై కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

పోలియోను జయించి.. సవాళ్లను ఎదుర్కొని..

బీహార్‌లోని నలందా జిల్లా హ నాత్ గ్రామానికి చెందిన జండు కుమార్ ప్రస్థానం ఎందరికో ఆదర్శం. ఒక సాధారణ కూరగాయల వ్యాపారి కుమారుడైన జండు, పుట్టుకతోనే పోలియో బారినపడ్డాడు. ఆర్థిక ఇబ్బందులు, శారీరక వైకల్యం వెంటాడినా దేనికీ లొంగిపోకుండా అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత్‌ను నిలబెట్టాడు.

అథ్లెటిక్స్ నుంచి పవర్‌లిఫ్టింగ్ వైపు.. జండు కుమార్ క్రీడా జీవితం పవర్‌లిఫ్టింగ్‌తో మొదలుకాలేదు. 2017లో ఆయన షాట్‌పుట్, డిస్కస్ త్రో అథ్లెట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పతకాలు కూడా సాధించాడు. అయితే, జిమ్‌లో శిక్షణ తీసుకుంటున్న సమయంలో పవర్‌లిఫ్టింగ్‌పై ఏర్పడిన ఆసక్తితో ఈ క్రీడ వైపు మళ్లాడు.

కరోనా కష్టాలు.. వీల్‌చైర్ లేని దుస్థితి

ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అవసరమైన కనీస పోషకాహారాన్ని కూడా కొనుగోలు చేయలేని స్థితిలో జండు కుటుంబం ఉండేది. కనీసం వీల్‌చైర్ కూడా లేకపోవడంతో జీవనోపాధి కోసం ప్రతిరోజూ 20 కిలోమీటర్లు ప్రయాణించి స్థానిక మార్కెట్లలో కూరగాయలు అమ్మేవాడు. స్నేహితుల దగ్గర అప్పు చేసి కొనుగోలు చేసిన ఈ-రిక్షాతో నెట్టుకొస్తున్న తరుణంలో, కరోనా మహమ్మారి లాక్‌డౌన్ కారణంగా ఆ వ్యాపారం కూడా పూర్తిగా దెబ్బతింది.

గురువు దొరికాడు.. రికార్డులు బద్దలయ్యాయి!

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ రహేలు కన్ను జండు కుమార్ పై పడింది. జండులోని అసాధారణ ప్రతిభను గుర్తించిన రాజిందర్, అతడిని గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) సెంటర్‌లో శిక్షణకు ఆహ్వానించాడు. రాజిందర్ మార్గదర్శకత్వంలో రాటుదేలిన జండు.. 2025 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 205 కిలోల బరువు ఎత్తి సరికొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. ఆ తర్వాత కొద్ది నెలలకే జరిగిన ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో 206 కిలోలు ఎత్తి తన పాత రికార్డును తానే తిరగరాశాడు.

ప్రస్తుత కామన్వెల్త్ పతకానికి ముందే బీజింగ్ ప్రపంచకప్ (2025), ఆసియా ఛాంపియన్‌షిప్ (2026) పోటీల్లోనూ కాంస్య పతకాలు సాధించిన జండు కుమార్, ఇప్పుడు కామన్వెల్త్‌లోనూ పతకం గెలిచి దేశ కీర్తి పతాకాన్ని ఎగరవేశాడు.



# భారత్‌లో యాషెస్ టెస్టుకు క్రికెట్ ఆస్ట్రేలియా యోచన

**బీసీసీఐ, ఈసీబీతో చర్చలకు సంకేతాలు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

భారత్‌లో క్రికెట్‌కు ఉన్న క్రేజ్, అపారమైన ఆదరణను మరింతగా సొమ్ము చేసుకునే దిశగా క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఒక ఊహించని చారిత్రాత్మక ప్రణాళికను రచిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రారంభం కానున్న ఆస్ట్రేలియా ప్రతిష్టాత్మక టి20 టోర్నీ 'బిగ్‌బాష్ లీగ్' (బీబీఎల్) తొలి మ్యాచ్‌ను చెన్నై వేదికగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్న సీఏ.. భవిష్యత్తులో వరల్డ్ క్రికెట్లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'యాషెస్ సిరీస్'లోని ఒక టెస్టు మ్యాచ్‌ను కూడా భారత్‌లో నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తోంది.

ముక్కోణపు సంబంధాలు.. పాడ్‌కాస్ట్‌లో సీఈఓ వెల్లడి

క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్ ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో పాటు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ)తో తమకు ఎంతో బలమైన, మెరుగైన సంబంధాలు ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

ప్రస్తుతానికి ఆలోచన మాత్రమే.. భారత్‌లో అంతర్జాతీయ క్రికెట్ వినోదాన్ని మరింతగా విస్తరించేందుకు బోలెడన్ని అవకాశాలు ఉన్నాయని టాడ్ గ్రీన్‌బర్గ్ అభిప్రాయపడ్డారు. అయితే భారత్‌లో యాషెస్ టెస్టు నిర్వహణపై ప్రస్తుతం ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ, రాబోయే రోజుల్లో ఆ దిశగా ఖచ్చితంగా ఆలోచించే అవకాశం ఉందని గ్రీన్‌బర్గ్ పేర్కొనడం విశేషం.

చారిత్రాత్మక పరిణామం కానుందా?

సాధారణంగా ఆస్ట్రేలియా – ఇంగ్లండ్ జట్ల మధ్య రెండేళ్లకోసారి జరిగే యాషెస్ టెస్టు సిరీస్‌కు ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే ఎంతో ప్రత్యేకమైన ప్రాధాన్యత, సంప్రదాయం ఉన్నాయి. ఇప్పటివరకు ఈ రెండు దేశాల సరిహద్దులు దాటని ఈ సంప్రదాయ సిరీస్‌లోని ఒక టెస్టు మ్యాచ్‌ను గనుక భారత్‌లో నిర్వహిస్తే.. అది ప్రపంచ క్రికెట్‌లోనే ఒక అతిపెద్ద చారిత్రాత్మక పరిణామంగా నిలిచే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు



# రణబలి విడుదలపై అయోమయం

## దసరా లేదా దీపావళికి తీసుకువచ్చే యత్నం



కథానాయకుడు విజయ్ దేవ రకొండ.. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, ఇప్పుడిది ఆ తేదీకి రాకపోవచ్చనే సంకేతాలందుతు న్నాయి. ప్రస్తుతం ఈ సినిమాని దసరా లేదా దీపావళి బరిలో దించేందుకు చిత్ర నిర్మాతలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ చిరంజీవి 'విశ్వంభర' దసరాకి రానట్లయితే అక్టోబరు 16న దీన్ని తెరపైకి తీసుకురావాలని.. లేదంటే దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఇది 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ - అతుల్ సంగీతమందిస్తున్నారు.

# మరో డిఫరెంట్ ప్రేమకథ.. చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్‌స్టోరీ' ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమాపై ఆసక్తిని పెంచించింది. తొలిప్రేమ గురించి చెప్పే సంభాషణలు ఉత్సాహాన్ని పెంచాయి. 'కలర్ ఫోటో', 'బేబీ' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ ఇవ్వడం, ఈ సినిమా క్లాసిక్ అవుతుందనే కోణంలో చేసిన ప్రచారం? ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రేమించిన వ్యక్తి పెళ్లి మండపంలోనే మోసం చేయడంతో నివి (శ్రీ గౌరీ ప్రియ) కుంగిపోతుంది. అలాంటి సమయంలో ఆమె జీవితంలోకి అడుగుపెట్టిన స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) మళ్లీ ప్రేమ, జీవితంపై ఆశలు చిగురించేలా చేస్తాడు. ఈ ఇద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ విధి ఈ ప్రేమకథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఏమిటా మలుపు? ఈ కథకు ఎలాంటి ముగింపు దొరికిందన్నదే 'చెన్నై లవ్ స్టోరీ' కథ. ప్రేమకు ఫాంటసీ జోడించిన కథ ఇది. ప్రేమలో విఫలమై దేవదాసులా మారిన కథానాయిక కోణంలో కథను ప్రారంభించడం తొలి సగానికి కొత్తదనాన్ని తీసుకొచ్చింది. స్టీవెన్ శంకర్ నివి జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఇద్దరి మధ్య పెరిగే అనుబంధం, ప్రేమ సహజంగా ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది. ద్వితీయార్థంలో దర్శకుడు కథను పూర్తిగా ఫాంటసీ వైపు మళ్లిస్తాడు. అది ఇదివరకే వచ్చిన 'ఎందుకంటే? ప్రేమంట!' సినిమాను గుర్తు చేసినా, 'చెన్నై లవ్‌స్టోరీ' ఆత్మ వేరు. హీరో పాత్రలో వచ్చే జెలసీ కావాల్సిన వినోదాన్ని పంచుతుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్స్ హత్తుకునేలా ఉంటాయి. ప్రేమ విషయంలో రెండు పాత్రల మధ్య కాస్త గందరగోళం ఏర్పడినప్పటికీ, ఈ సినిమాకు దర్శకుడు ఇచ్చిన క్లైమాక్స్ హత్తుకునేలా ఉంటుంది. స్టీవెన్ శంకర్ పాత్రలో కిరణ్ అబ్బవరం చూపించే అమాయకత్వం, చలాకీతనం సహజంగా ఉంటాయి. చాలా ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. దర్శకుడు కావాలనే తన కల, అలాగే నివితో ప్రేమ, తను అనాథ అనే భావం.. ఇవన్నీ సహజంగా పలికించాడు. నివి పాత్రలో శ్రీగౌరీ ప్రియ ఈ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచింది. ఆమె నటన చాలా హుందాగా ఉంది. ఈ జోడీ తెరపై అందంగా కనిపించింది. దర్శకుడు రవి నంబూరి సాయి రాజేశ్ కథలోని భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. సాంకేతికంగా మణిశర్మ సంగీతం సినిమాకు ప్రాణం పోశాయి. 'గుర్తుందా', 'వదలనే' పాటలు చక్కగా కుదిరాయి. విశ్వాస్ డేనియల్ ఛాయాగ్రహణం, చెన్నై వాతారవణం, వర్షం, కొన్ని క్లాసిక్ సినిమాలని గుర్తు చేసే ఫ్రేమ్స్, ఉన్నతమైన నిర్మాణ విలువలు సినిమాకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.






# జననాయగన్ ఓపెనింగ్స్ అంతంతమాత్రమే




జి 5 ఓటిటి హక్కులు పొందినట్లు ప్రచారం

తమిళ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' ఎట్టకేలకు జూలై 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. రిలీజ్‌కి ముందు ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే మూవీ విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి ఓపెనింగ్స్ రాకపోయినా, ఇప్పుడు సినిమా ఓటీటీ హక్కుల వ్యవహారం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దళపతి వెట్రి కొండన్ పాత్రలో కనిపించారు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్, ప్రియమణి, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. సినిమాలో విజయ్ మాస్ ఎలివేషన్స్, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకున్నప్పటికీ, కథనం నెమ్మదిగా సాగడం, కొన్ని సన్నివేశాలు సాగదీతగా ఉండటంపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. సినిమా విడుదలకు ముందే అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను సుమారు రూ.110 కోట్లకు సొంతం చేసుకునే దిశగా చర్చలు జరిపినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపించాయి. అయితే విడుదల ఆలస్యం, ఇతర కారణాలతో ఆ ఒప్పందం చివరికి కుదరలేదని సమాచారం. ఆ తర్వాత ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా హక్కులను సుమారు రూ.50 కోట్లకు దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో దాదాపు రూ.60 కోట్ల తేడాతో ఓటీటీ భాగస్వామి మారిపోయిందనే వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆగస్టు 21 నుంచి 'జన నాయగన్' జీ5లో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో




సినిమా అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. విజయ్ సినీ జీవితానికి ముగింపు పలికిన ఈ చిత్రాన్ని థియేటర్లలో చూడాలని అభిమానులు భావిస్తుండగా, ఓటీటీ విడుదల కోసం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే డిజిటల్ రిలీజ్, హక్కుల వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# విశ్వనాథ్ అండ్ సన్స్..తమిళ సినిమానే

తెలుగులో డబ్ చేసి విడుదల చేస్తున్నాం

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్యకు జోడీగా యువ నటి మమితా బైజు నటిస్తుండగా, ఆగస్టు 14న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై చాలా రోజులుగా ప్రచారంలో ఉన్న ఒక ముఖ్యమైన విషయానికి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటివరకు ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో ఒకేసారి చిత్రీకరించిన ద్విభాషా సినిమాగా చాలా మంది భావించారు. అయితే అది పూర్తిగా నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్‌ను పూర్తిగా తమిళ భాషలో మాత్రమే చిత్రీకరించాం. తర్వాత తెలుగు ప్రేక్షకుల కోసం డబ్బింగ్ వెర్షన్‌ను విడుదల చేస్తున్నాం. ఇది బైలింగ్వల్ సినిమా కాదు' అని వెల్లడించారు. దీంతో ఈ చిత్రంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. తెలుగు నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న కారణంగా ఈ సినిమాను చాలా మంది తెలుగు-తమిళ ద్విభాషా చిత్రంగా భావించారు. కానీ దర్శకుడి తాజా వ్యాఖ్యలతో ఇది తమిళ చిత్రంగానే రూపొంది, తెలుగులో డబ్ అవుతున్న సినిమా అని స్పష్టమైంది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు, సూర్య స్టైలిష్ లుక్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపిన కథతో ఈ సినిమా తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.




# అమెరికా ప్రచారంలో రామాయణ టీమ్




దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ' గ్లోబల్ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. అమెరికాలో జరుగుతోన్న ప్రముఖ శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్ర బృందం పాల్గొని సందడి చేసింది. రణ్‌బీర్ కపూర్, యశ్, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు నిర్మాత నమిత్ మల్హోత్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్‌పై యశ్ ప్రశంసలు కురిపించారు.'రాముడి పాత్ర పోషించడం చాలా కష్టం. రణ్‌బీర్ కపూర్ గొప్పగా నటించాడు. ఈ పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా చూసినప్పుడు అతడి నిబద్ధత కనిపిస్తుంది. ఇలాంటి సినిమాను చిత్రీకరించాలంటే సంకల్ప బలం ఉండాలి. మంచి టీమ్ ఉన్నప్పుడు ప్రతీది కలిసి వస్తుంది. ఈ సినిమా ప్రారంభించాక జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను అర్థం చేసుకోవడం మొదలుపెట్టాం. మేకప్ నుంచి లుక్స్ వరకూ సాంకేతికంగా ఇది ఎంతో సవాలుతో కూడుకున్న పని. మా శక్తివంచన లేకుండా కృషి చేశాం' అని యశ్ అన్నారు. ఈ సినిమా ట్రైలర్ నేడు విడుదల కావాల్సి ఉండగా.. వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని టీమ్ భావిస్తోంది. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు.

# మంగళవారం మూవీకి సీక్వెల్




తెలుగు సినీ పరిశ్రమలో తనదైన మేకింగ్ స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో దర్శకుడిగా సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'మహాసముద్రం' తో నిరాశపరిచినా, 'మంగళవారం' చిత్రంతో మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, మోహన్ బాబు, నరేష్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాలు వెల్లడించారు.'మంగళవారం' చిత్రానికి సీక్వెల్‌పై వస్తున్న వార్తలకు అజయ్ భూపతి అధికారికంగా స్పందించారు. 'మంగళవారం 2' తప్పకుండా తెరకెక్కుతుంది. ఈసారి ప్రేక్షకులు ఊహించని స్థాయిలో కథను సిద్ధం చేస్తున్నాం. మొదటి భాగానికి పూర్తి భిన్నంగా, మరింత థ్రిల్లింగ్ అనుభూతిని అందించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈసారి కథలో సూపర్ నేచురల్ అంశాలకు పెద్దపీట వేస్తున్నామని అజయ్ భూపతి వెల్లడించారు. ప్రతి పాత్ర, ప్రతి సంఘటన ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథను రూపొందిస్తు న్నామని చెప్పారు. ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' పనుల్లో పూర్తిగా బిజీగా ఉన్నానని, ఆ సినిమా విడుదలైన తర్వాత పూర్తిస్థాయిలో 'మంగళవారం 2' స్క్రిప్ట్‌పై దృష్టి పెడతానని తెలిపారు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'మంగళవారం 2' కథను అజయ్ భూపతి దర్శకుడు కొరటాల శివకు వినిపించినట్లు తెలుస్తోంది. కథ నచ్చడంతో ఆయన తన నిర్మాణ సంస్థ యువసుధా ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అజయ్ భూపతి తాజా వ్యాఖ్యలతో 'మంగళవారం 2' టాలీవుడ్‌లో ఇప్పటి నుంచే హాట్ టాపిక్‌గా మారింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

